సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | ఆదివారం 10 మే 2026

సంపుటి: 17 | సంచిక: 132
పేజీలు: 08 | వెల: రూ.2:00

Published from Hyderabad, Vijayawada.

## నూతన సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

- భారత సైన్యంలో కీలక మార్పులు..
- సీడీఎస్, నేవీ చీఫ్‌ల నియామకం



న్యూఢిల్లీ,మే9(సాక్ష్యం): భారత రక్షణ దళాల్లో రెండు అత్యంత కీలకమైన నియామకాలు జరిగాయి. దేశ నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. అలాగే, నౌకాదళానికి నూతన అధిపతిగా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్‌ను ఎంపిక చేసింది. ప్రస్తుత సీడీఎస్ జనరల్

మిగతా 5 లో..




## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

**అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమిటి?**
**కేసీఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం**
**రైతులంటే పట్టింపులేని సీఎం రేవంత్**
**అకాల వర్షాలతో నష్టపోయినా చర్యలు లేవు**
**బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు**

సిద్దిపేట,మే9(సాక్ష్యం): కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు.

మిగతా 2 లో..



## మనీలాండరింగ్ కేసులో ఈడీ దూకుడు

**పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరా అరెస్ట్**

చండీఘడ్,మే9(సాక్ష్యం): మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పంజాబ్ పరిశ్రమల శాఖా మంత్రి సంజీవ్ అరోరాను

మిగతా 2 లో..



## బండి తనయుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు

**మైనార్ బాలికపై అత్యాచరం జరిపినట్లు ఫిర్యాదు**

హైదరాబాద్,మే9(సాక్ష్యం): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ భారతీయ జనతా పార్టీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయినట్లు

మిగతా 2 లో..

**తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ప్రతిష్ఠంభనకు ఎట్టకేలకు తెరపడింది. ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో తమిళనాడు సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నాలుగు రోజుల ఉత్కంఠ తర్వాత టీవీకేకు మద్దతు ప్రకటిస్తూ వీసీకే లేఖ అందించింది. కాసేపటికే ఐఎంయూఎల్ కూడా విజయ్‌కు మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐఎంయూఎల్ మద్దతుతో టీవీకే బలం 120కి చేరింది. ఈ నేపథ్యంలో గవర్నర్‌ను కలిసిన విజయ్ మద్దతు లేఖలు సమర్పించారు. ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన గవర్నర్, తమిళనాడు సీఎంగా విజయ్‌ను నియమిస్తూ లేఖ ఇచ్చారు.**

# ముగిసిన సస్పెన్స్

## ఎట్టకేలకు తమిళనాడు ఉత్కంఠకు తెర

- **తమిళనాడు కొత్త సీఎంగా విజయ్**
- విజయ్‌ను నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు
- నేడు పది గంటలకు సీఎంగా విజయ్ ప్రమాణం
- మద్దతు లేఖలు సమర్పణ.. గంటన్నరకు పైగా చర్చలు
- గవరనర్ లేఖతో బయటకు వచ్చిన టీవీకే అధినేత
- 13లోగా మెజార్టీ నిరూపించుకోవాలని గవర్నర్ సూచన
- ప్రభుత్వానికి బయటనుంచి మద్దతుకు చిన్న పార్టీల నిర్ణయం



చెన్నై,మే9(సాక్ష్యం): తమిళనాడు రాజకీయాల్లో అనిశ్చితి వీడింది. సిఎంగా జోసెఫ్ విజయ్ నియమితులయ్యారు. దీంతో ఆయన నేడు ఉదయం పదిగంటలకు తమిళనాడు సిఎంగా ప్రమాణం చేయనున్నారు. నెహ్రూ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత నాలుగు రోజుల ఉత్కంఠకు తెరదించుతూ శనివారం గవర్నర్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రకటన చేశారు. అంతకుముందు విజయ్ తన అనుచరులతో కసలి గవర్నర్ను కలిసి చర్చించారు. తనకు మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలను అందించారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ జోసెఫ్ విజయ్‌ను సిఎంగా నియమిస్తూ లేఖలను అందించారు. దాదాపు గంటా నలభై నిముషాలు వీరి భేటీ జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక మలుపులు తిరిగిన అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్

మిగతా 2 లో..



# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

- ఆయనతోపాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం
- ప్రమాణం చేయించి గవర్నర్‌ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సీఎంలు హాజరు
- బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం
- అశేషంగా హాజరైన ప్రజలకు అభివాదం




కోల్‌కతా,మే9(సాక్ష్యం): పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ

మిగతా 5 లో..



# నేడు ప్రధాని నరేంద్రమోదీ రాక

- కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్న ప్రధాని
- జహీరాబాద్ వద్ద 2,360 కోట్లతో స్మార్ట్ సిటీ
- 3175 కోట్లతో మహబూబ్‌నగర్ జాతీయ రహదారి
- 611 కోట్లతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్
- 1243 కోట్లతో కాజీపేట-విజయవాడ ట్రిపులింగ్
- వరంగల్ జిల్లలో 200 కోట్లతో ఈ టెక్స్ టైల్ పార్క్
- కోమటిపల్లిలో రైల్వే సొరంగ మార్గం
- 8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంఖుస్థాపన
- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు
- డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులపై నిషేధం
- 2వేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- మల్కాజిగిరి డిసీపీ సుమతి వెల్లడి



వరంగల్,మే9(సాక్ష్యం): ప్రధాని మోదీ ఈ పర్యటనలో భాగంగా వివిధ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పించే అవకాశం ఉంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వద్ద 2,360 కోట్లతో అభివృద్ధి చేయనున్న

మిగతా 3 లో..



# ప్రణాళికబద్ధంగా నగరాభివృద్ధి

## ట్రాఫిక్ రద్దీ లేని నగరంగా హైదరాబాద్

- పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు
- సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ది
- రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం

హైదరాబాద్,మే9(సాక్ష్యం): ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు

మిగతా 5 లో..

## 11 నుండి విద్యా వారోత్సవాలు

**జిల్లా కాలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్,మే9(సాక్ష్యం): 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించేచే విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన

మిగతా 2 లో..



# సంపాదకీయం

## తమిళనాట భేతాళ ప్రశ్నలు ?

తమిళనాట ప్రతిష్ఠంభనకు చిన్న పార్టీలు ఆడుతున్న పెద్ద డ్రామాలు కలుషిత రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. లెఫ్ట్ పార్టీలు, ముస్లిం పార్టీ సహా ఇతర చిన్న పార్టీలు ఒకటి అరా సీటు సంపాదించినా బేరాలాడుతున్న తీరు వల్ల తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుకు ఆటంకాలు వస్తున్నాయి. ఈ క్రమంలో తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. టీవీకేకు ఏఎంఎంకే మద్దతు ఇచ్చినట్లు వస్తున్న వార్తలను ఆ పార్టీ అధినేత దినకరన్ తోసిపుచ్చారు. తమ ఎమ్మెల్యే మద్దతిస్తున్నారని పేర్కొంటూ గవర్నర్‌కు టీవీకే నేతలు జిరాక్స్ కాపీ ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. అయితే, అసలైన లేఖ ఎక్కడుందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అది లభిస్తేనే వాస్తవాలు బయటపడతా యన్నారు. లేఖపై తాను సంతకం చేస్తున్నట్లు టీవీకే విడుదల చేసిన వీడియోపై ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్పందిస్తూ.. అది కృత్రిమ మేధ ఆధారిత వీడియో అని ఆరోపించారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమంటూ టీవీకే అధినేత విజయ్ వరుసగా గవర్నర్‌ను కలుస్తుండటంపై డీఎంకే విమర్శలు గుప్పించింది. గవర్నర్‌ను సంప్రదించడానికి ముందే ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవాలని సూచించింది. ఎమ్మెల్యేల మద్దతు లేకుండా గవర్నర్‌కు లేఖ ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించింది. రాష్ట్రంలో నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించా లని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ పేర్కొన్నారు. ప్రజాతీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిందే నన్నారు. ప్రభుత్వ ఏర్పాటు పక్రియలో జాప్యం చేయొద్దని.. వెంటనే దీనిని పూర్తిచేయాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ మెజార్టీ లేక ప్రభుత్వ ఏర్పాటులో ఇబ్బందులు పడుతున్న విజయ్.. త్వరలో వీసీకే చీఫ్‌ను కలవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈసందర్భంగా తమకు మద్దతు ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది. ప్రజా తీర్పును వమ్ము చేసేలా చిన్న పార్టీలు దోబూచులాడు తున్నాయి. మద్దతుకు ఓకే చెప్పి గవర్నర్‌కు లేఖలు అందించడంలో వెనక్కి తగ్గాయి. దీంతో మెజార్టీ విషయంలో గవర్నర్ సంతృప్తి చెందక పోవడంతో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అధికారం పొందడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కు కేవలం పదకొండు స్థానాలు తక్కువ. ఇటువంటి పరిస్థితిలో అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నేతను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడం అన్నది కేవలం ఆనవాయితీ మాత్రమే. గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపికి నాటి రాష్ట్రపతి అటువంటి అవకాశం ఇవ్వడం 13 రోజుల్లో మెజారిటీ రుజువు చేసుకోలేక వాజ్‌పేయి రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే! దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ ఇటువంటి దృష్టాంతాలెన్నో జరిగాయి. అయితే ప్రమాణానాఇకి ముందు మద్దతు లేఖలతో సం÷-యా బలం తెలుసుకోవడం గవర్నర్ విధి. దీనిని ఎవ్వరూ తప్పు పట్టాల్సిన పనిలేదు. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీకి మె.ఆర్టీ సీట్లు కట్టబెట్టారు. ఫలితాలు వచ్చిన మరునాడే అతి పెద్ద పార్టీగా వచ్చిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని గవర్నర్ ఆహ్వానిస్తూనే మద్దతు లేఖలు కోరారు. అయితే విజయ్ కూడా ఈ విషయంలో కొంత డ్రామాలు ఆడుతున్నట్లుగా ఉంది. అయిదు సీట్లున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్నప్పటికీ మెజారిటీకి అవసరమైన మద్దతు మాత్రం చూపడం లేదు. తమిళ ప్రజా తీర్పును అమలు చేయడానికి తమిళనాట గందరగోళం సృష్టించాలని తమిళ పార్టీలే యత్నిస్తున్నాయి. వామపక్షాలు బేషరతు నిర్ణయం తీసుకొని టివికె ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి. విసికె మద్దతు లేఖ ఇస్తే మేజిక్ ఫిగర్ చేరుకోవడం సులువవుతుంది. ఈ క్రమంలో తమిళనాడులో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై ఇంకా ప్రతిష్టంభన వీడలేదు. విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు సతమతమవుతోంది. చిన్న పార్టీల మద్దతు ఉందని చెబుతూ మూడు రోజుల్లో మూడుసార్లు గవర్నర్‌ను కలిసినా.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆ రాష్ట్ర లోక్‌భవన్ నుంచి పిలుపు రాకపోవడం తమిళ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. ఇదంతా కేవలం మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలు సమకూర్చడంలో చేస్తున్న జాప్యంగానే చయేడాలి.

## 11 నుండి విద్యా వారోత్సవాలు

మొదటిపేజీ తరువాయి..

కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సి ఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్ బి స్టేడియం లో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సి ఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ , పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

మొదటిపేజీ తరువాయి..

ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉ ందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరేళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు మండుటెండల్లోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు పేరొస్తదని తమ్మడిహట్టి అంశం తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రం గురించి రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు. అకాల వర్షాల వల్ల రైతులు చాలా నష్టపోతున్నారని.. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి రైతులపై పట్టింపు లేదని.. మూడు పంటలకు రైతుబంధు కూడా ఇవ్వలేదని హరీశ్ విమర్శించారు. ఢిల్లీకి లేఖలు రాయడం మాని, వెంటనే పండిన పంటను కొనుగోలు చేయాలని సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లిపూర్ సొసైటీ వద్ద పొద్దు తిరుగుడు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు బాధపడుతుంటే ముఖ్యమంత్రి




కాంగ్రెస్ డ్రామాలు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతు చేసి సాగు, తాగు నీళ్ల ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణహితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024-25 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బడ్జెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనులకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్దాలకూ హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసరవెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఒక్క రివ్యూ మీటింగ్ కూడా పెట్టలేదని విమర్శించారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం కోతల సీజన్ వచ్చినప్పుడల్లా రివ్యూ మీటింగ్‌లు పెట్టి రైతుల అవసరాలన్నీ తీర్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎంతో పాటు మంత్రులు కూడా రివ్యూ చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. వడ్లు, పొద్దు తిరుగుడు, మక్కలు ఎలా కొనుగోలు చేస్తున్నారో చూడడానికి ఒక్క మంత్రి కూడా రైతుల దగ్గరికి రాలేదని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రభుత్వానికి రైతుల కంటే ముఖ్యమైన పని మరేముంటుందని ప్రశ్నించారు. సిద్దిపేట, చిన్నకోడూరు మండలాల్లో సన్‌ఫ్లవర్ రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అని తేడా లేకుండా రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయాలని చెబుతున్నారని.. పంట మార్పిడి చేస్తే కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సూర్యాపేట, సిద్దిపేట, జాలి తదితర ప్రాంతాల్లో వడ్లను బి గ్రేడ్ పేరుతో, తరుగు పేరుతో రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి.. మాటలు బంద్ చేసి ఐకేపీ సెంటర్ దగ్గరికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడాలి. 40 రోజులుగా సన్‌ఫ్లవర్ కొనుగోలు చేయకపోవడంతో పంటకు చెదలు పడుతున్నాయి' అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ముగిసిన సస్పెన్స్

మొదటిపేజీ తరువాయి..

రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేశారు. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్‌ను నియమిస్తూ లోక్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. శనివారం గవర్నర్‌ను కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం వేదికగా టీవీకే చీఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం




చేయనున్నారు. మే 13వ తేదీలోగా బల నిరూపణ చేసుకోవాలని సూచించారు. దీంతో ఇక తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఈనెల 10న కొలువు తీరనుంది. గవర్నర్ అపాయిమెంట్ ఇవ్వడంతో శనివారం సాయంత్ర లోక్‌భవన్‌లో ఆయనను విజయ్ కలుసుకున్నారు. టీవీకేకు మద్దతిస్తున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఐయూఎంఎల్ నేతలు కూడా విజయ్ వెంట గవర్నర్‌ను కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖలను విజయ్ గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఇందుకు గవర్నర్ సమ్మతించారు.

చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తదుపరి మంత్రి వర్గ విస్తరణలో భాగస్వామ్య పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఈనెల 4న వెలువడిన ఫలితాల్లో విజయ్ టీవీకే 108 సీట్లతో ఏకైక పెద్దపార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన గవర్నర్ మూడుసార్లు విజయ్‌కు అనుమతి నిరాకరించారు. ఈనెల 10వ తేదీతో గవర్నర్ ఇచ్చిన గడువు ముగియనుండటంతో ఉ త్కంఠ కొనసాగుతూ వచ్చింది. రెండు చోట్ల నెగ్గిన విజయ్ ఒకచోట వదులుకోవాల్సి ఉండటంతో టీవీకే బలం 107కు చేరింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు, వామపక్షాల నుంచి నలుగురు ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడంతో అది 116కు చేరింది. అయితే మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుపై సస్పెన్స్ కొనసాగుతూ వచ్చింది. ఎట్టకేలకు ఇద్దరు ఎమ్మెల్యేలున్న వీసీకే బేషరుతుగా టీవీకేకు మద్దతు తెలిపింది. దీంతో పూర్తి సంఖ్యాబలం చేకూరిన విజయ్ నాలుగోసారి గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అయితే అప్పుడు కూడా సస్పెన్స్ కొనసాగింది.

కేరళ పర్యటన ఉండటంతో గవర్నర్ అందుబాటులో లేరని చెప్పిన లోక్‌భవనన్ వర్గాలు ఆ తర్వాత కొద్దిసేపటికే గవర్నర్ పర్యటన రద్దయిందంటూ ఆపాయింట్‌మెంట్ ఖరారు చేసింది. దీంతో నాలుగోసారి గవర్నర్‌ను కలిసిన విజయ్ పూర్తి సంఖ్యాబలాన్ని గవర్నర్ ముందుంచారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు ఇస్తున్న వీసీకే.. క్యాబినెట్ బెర్తులు మాత్రం వద్దని చెప్పింది. 'మేం ప్రభుత్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా..? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం' అని వీసీకే చీఫ్ తిరుమావళవన్ మీడియాకు వెల్లడించారు. తాము ఇప్పటికీ డీఎంకే నేతృత్వంలోని కూటమిలోనే ఉన్నామని వీసీకే, ఐయూఎంఎల్ వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో చెన్నై సమీపంలో టీవీకే ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్ బయట భద్రతను భారీగా పెంచారు. ప్రస్తుతం విజయ్‌కు మద్దతు ఇస్తున్న సభ్యుల సంఖ్య 120కి చేరింది.పార్టీల వారీగా సంఖ్యాబలం ఇలా ఉన్నాయి. టీవీకే : 107, కాంగ్రెస్ : 5, సీపీఐ : 2, సీపీఎం : 2, వీసీకే : 2, ఐయూఎంఎల్: 2 ఉన్నాయి.

## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

**సిఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ**

**నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉందన్న పార్టీ నేతలు**

న్యూఢిల్లీ/ తిరువనంతపురం,మే9(సాక్ష్యం): తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆదివారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పర్యటించిన ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు శుక్రవారం నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం 4 గంటలకు ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి రాహుల్ గాంధీ, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, సీఎం పదవి రేసులో ఉన్న వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల



హాజరయ్యారు. కీలక సమావేశం ముగిసిన అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## బండి తనయుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు

మొదటిపేజీ తరువాయి..

సమాచారం. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. చివరికి గత అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు అనంతరం బండి సంజయ్ కొడుకు భగీరాథ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇంతకుముందు కూడా కాలేజీలో ఒక విద్యార్థిపై దాడి చేసి భగీరథ్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అయితే భగీరథ్‌పై పాత వివాదాల నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో చేసిన ట్వీట్ ఇప్పుడు మళ్ళీ వైరల్‌గా మారింది. భగీరథ్‌ను ఇరాక్ మాజీ నియంత సద్దాం హుస్సేన్ కుమారుడు ఉదయ్ హుస్సేన్‌తో పోలుస్తూ ఆర్జీవీ అప్పట్లో చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచింది.

## మనీలాండరింగ్ కేసులో ఈడీ దూకుడు

మొదటిపేజీ తరువాయి..

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం అరెస్టు చేసింది. మోసపూరిత జీఎస్టీ లావాదేవీలతో రూ.100 కోట్ల నగదు అక్రమ రవాణా జరిగినట్టు ఆరోపణలు రావడంతో దర్యాప్తు ప్రారంభించిన ఈడీ తాజాగా మంత్రిని పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్టు చేసింది. ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్‌లోని మంత్రి సంజీవ్ అధికారిక నివాసం సహా మొత్తం ఐదు చోట్ల ఈడీ అంతకుముందు సోదాలు నిర్వహించింది. మంత్రికి సంబంధించిన వ్యక్తులు, కంపెనీల భవనాల్లో కూడా రెయిడ్స్ నిర్వహించిన అనంతరం మంత్రి సంజీవ్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మంత్రికి సంబంధించిన వారు ఫేక్ కంపెనీల సాయంతో మొబైల్ ఫోన్ కొనుగోళ్ల



పేరిట నకిలీ బిల్లులను సృష్టించారు. ఈ బిల్లుల సాయంతో అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, జీఎస్టీ రీఫండ్స్, ఇతర ఎగుమతి ఆధారిత ప్రయోజనాలను ÷-లకెయిమ్ చేసుకున్నారు. ఇలా అక్రమంగా వచ్చిన డబ్బును అక్రమంగా దుబాయ్‌కు పంపించి తిరిగి భారత్‌కు తీసుకొచ్చి మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు అధికారులు ఆరోపిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రి అరెస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఆప్ నేతలు మాత్రం మంత్రి సంజీవ్ అరెస్టును ఖండిస్తున్నారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల సాయంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు. ఈ ఈడీ రెయిడ్స్ ఉ ద్దేశం నల్ల ధనాన్ని వెలికి తీయడమో లేక ఇతర డాక్యుమెంట్స్‌ను వెలుగులోకి తేవడమో కాదు. బీజేపీలో చేరితే ఇవన్నీ పోతాయని రెయిడ్స్ ఎదుర్కొంటున్న వారికి ఒక సంకేతం పంపించడమే అసలు లక్ష్యం' అని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మీడియాతో అన్నారు.

## మొక్కజొన్న దగ్ధంతో రైతుకు భారీ నష్టం

పెద్దపల్లి,మే9(సాక్ష్యం): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైన కౌలు రైతు గోపు శ్రీనివాస్‌ను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ డిమాండ్ చేశారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన మొక్కజొన్న చేను వారు శనివారం పరిశీలించారు. బాధిత రైతు శ్రీనివాస్ ఎకరంన్నర భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగు చేయగా, పంట చేతికొచ్చే సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పంట పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 1.50 లక్షల మేర పంట నష్టం జరిగినట్లు తెలిపారు. రైతుబంధు సాయం అందక, కౌలు భారంతో ఉన్న రైతుకు ఈ నష్టం కోలుకోలేని దెబ్బ అని, కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే స్పందించి పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగా శ్రీనివాస్ రెడ్డి, సుముఖం రవీందర్ రెడ్డి, నక్కల రాయమల్లు, అల్లం సదయ్య, జంగా సుఖేందర్ రెడ్డి, శ్రీనివాస్, పెంట రవి,జంగ రాజిరెడ్డి మూల సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భూముల ధరల పెంపు నిర్ణయం

### రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్

హైదరాబాద్,మే9(సాక్ష్యం): భూముల ధరల సవరణ నిర్ణయంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు చొరవ చూపుతున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అదనంగా పని చేయనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీ నగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో అదనపు పనివేళలు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే మరింత సమయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించింది. భూముల ధరలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. అధిక రద్దీగా ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్ నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్ కేసర్, నల్గొండ ఆర్ఓ, పటాన్ చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని వేళలను అదనంగా పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలు ఉంటాయని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి పొడిగించిన పని వేళలు నిర్దేశించిన పదిహేను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో అవసరమైతే మరింత సమయాన్ని పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. అదే విధంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు. అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను కూడా సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## హర్ముజ్ వద్ద నావలో మంటలు

### భారతీయ నావికుడు దుర్మరణం

న్యూఢిల్లీ,మే9(సాక్ష్యం): హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఒక నావలో మంటలు చెలరేగడంతో ఒక భారతీయ నావికుడు కన్నుమూసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ఘటనలో మరో నలుగురు గాయాలపాలైనట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాద సమయంలో నావలో 18 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. మంటలు చెలరేగటానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనలో గాయపడ్డ వారికి



దుబాయ్‌లో వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై దుబాయ్‌లోని భారతీయ కాన్సులేట్ కూడా స్పందించింది. క్షతగాత్రులను ఆసుపత్రిలో పరామర్శించామని తెలిపింది. నావ యజమానితో నిత్యం అందుబాటులో ఉన్నామని కూడా పేర్కొంది. అన్ని రకాల సాయాలను అందిస్తున్నామని తెలిపింది. ఈ ఘటన విచారకరమని కూడా పేర్కొంది. ఇరాన్, యూఎస్ మధ్య హోర్ముజ్ వేదికగా ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న వేళ ఈ పరిణామానికి ప్రాధాన్యం ఏర్పడింది. శుక్రవారం హోర్ముజ్‌లో ఇరాన్, యూఎస్ దళాలు పరస్పరం కాల్పులకు దిగిన విషయం తెలిసిందే. మొదట కాల్పులకు దిగింది అమెరికాయేనని ఇరాన్ ఆరోపించింది. నౌకలను, సాధారణ పౌరులను అమెరికా టా÷–గ్గ÷ట్ చేసిందని ఆరోపించింది. కానీ ఇరాన్ దాడులకు తాము ప్రతిదాడులు మాత్రమే చేశామని అమెరికా తేల్చి చెప్పింది. ఈ కాల్పులను చిన్న విషయంగా కొట్టిపారేసిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ ఆ తరువాత ఇరాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. చర్చలను మళ్లీ ప్రారంభించకపోతే ఇలాంటి దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# నేడు ప్రధాని నరేంద్రమోదీ రాక



**మొదటిపేజీ తరువాయి..**

ఈ స్మార్ట్ సిటీకి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇది పారిశ్రామిక రంగంలో తెలంగాణకు కొత్త దిశకు చూపించనుంది. 3175 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న గూడెబెల్లూరు మహబూబ్‌నగర్ జాతీయ రహదారి పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నారు. 611 కోట్లతో మల్లాపూర్ వద్ద ఏర్పాటు చేయనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. 1243 కోట్లతో పూర్తి చేసిన కాజీపేట–విజయవాడ ట్రిపులింగ్ పనులకు ప్రధాని జాతీకి అంకితం చేస్తారు.వరంగల్ జిల్లలో 200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ టెక్స్ టైల్ పార్క్ సొరంగ మార్గాన్ని ప్రధాని నరేంద్రమోదీ హైదబాదాద్ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర దక్షిణ భారతానికి ముఖ ద్వారమైన కాజీపేట రైల్వే జంక్షన్ సమీపంలోని కోమటిపల్లి వద్ద రైలు ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ భూగర్భ సొరంగం మార్గం నిర్మించారు. దీంతోపాటు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట–బలార్షా, కాజీపేట–విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీకి అనుగుణంగా 421 కిలో మీటర్ల మూడో లైన్‌ను ఏర్పాటు చేశారు. గ్రాంట్ ట్రంక్ రూట్‌లో ఢిల్లీ–సికింద్రాబాద్, విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీని తగ్గించేందుకు రైల్వేశాఖ



తెలంగాణ చేనేత, వస్త్ర రంగానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి సహాయపడుతుంది. కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని మూడో లైన్, కోమటిపల్లి భూగర్భ రైల్వే దాదాపు 12 ఏళ్ల కాలంలో దాదాపు రూ.4015 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసింది. ఈ రెండు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని రైల్వే అధికారులు వెల్లడించారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు. ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, ముఫ్తీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. మోదీ భారీ బహిరంగ సభకు నగర యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఈ సభకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై మల్కాజిగిరి డిసిపి సుమతి కీలక వివరాలను వెల్లడించారు. సభను ప్రశాంతంగా నిర్వహించేందుకు సుమారు 2,000 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా సభా ప్రాంగణంలోకి డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులను తీసుకురావడంపై నిషేధం విధించారు. బహిరంగ సభ దృష్ట్యా.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లపై ఎక్కడైనా వాహనాలను పార్క్ చేస్తే.. వాటిని వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సభకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామని, వాహనదారులు పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా అక్కడ క్యూఆర్ (ఖీఖీ) కోడ్‌లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

# గంజాయి బ్యాచ్ పట్టివేత

**భారీగా గంజాయి ప్యాకెట్లు స్వాధీనం**

**ఇద్దరు అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్**

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ**

నల్లగొండ,మే9(సాక్ష్యం): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి వారి నుండి 104.5 కేజీల గంజాయి, ఒక లారీ, రెండు సెల్ ఫోన్లను నల్లగొండ పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం విజయవాడ నుండి హైదరాబాద్‌కు భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం రావడంతో కేతేపల్లి ఎస్ఐ సతీష్ పోలీసు సిబ్బంది, క్లూస్ టీమ్‌తో కలిసి కొర్లపహాడ్ టోల్ ప్లాజా సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రీన్ కలర్ అశోక్ లేలాండ్ లారీని ఆపి తనిఖీ చేయబోతుండగా లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వాహనం దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదాలు జరుపగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయన్నారు. నిందితులను జమ్ముకాశ్మీర్‌కు చెందిన పరంవిర్ సింగ్ అలంబుగా, మహారాష్ట్రకు చెందిన షా ఆలం పర్వేష్ ఆలం అన్సారిగా గుర్తించినట్లు తెలిపారు. అంతర్ రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నకిరేకల్ సీఐ హరిబాబు, కేతేపల్లి ఎస్ఐ సతీష్, పోలీస్ సిబ్బంది బి.వెంకటేశ్వర్లు, బి.వెంకట కృష్ణ, స్వామి, వెంకన్న, బాసిత్లను ఎస్పీ అభినందించారు. ఇదిలావుంటే నల్లగొండ జిల్లా కేంద్రంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న ముఠాను అరెస్టు చేసి వారి నుండి 300 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం హైదరాబాద్ రోడ్‌లోని హౌజింగ్ బోర్డు కాలనీ వద్ద గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం




వచ్చినట్లు తెలిపారు. టూటౌన్ ఎస్ఐ యర్రా సైదులు తన సిబ్బంది బాలకోటి, షకీల్‌తో కలిసి పర్యటిస్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు రెండు బైకులపై అక్కడ అనుమానాస్పదంగా నిలబడి ఉండడంతో వారిని విచారించేందుకు ప్రయత్నించగా పారిపోవడానికి యత్నించారన్నారు. వెంటనే అప్రమత్తమై వారిని చేదించి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు.వారిని విచారణ చేయగా హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ నయీమ్ అ ముజీబ్, మహమ్మద్ సోహెల్, షేక్ లతీఫ్ గా గుర్తించినట్లు చెప్పారు. పారిపోయిన వ్యక్తి రవీంద్రనగర్ కు చెందిన రౌడీషీటర్ బంటు–కార్తీక్‌గా తెలిసిందన్నారు. వారిని సోదా చేయగా వారి వద్ద 300 గ్రాముల గంజాయి లభించినట్లు వెల్లడించారు. పరారీలోన్న బంటు కార్తీక్ ఇతర ప్రాంతాల నుండి గంజాయిని కొనుగోలు చేసి వీరికి సరఫరా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. నిందితులు స్వయంగా గంజాయి సేవించడమే కాకుండా, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్ ను రూ.500లకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పరారీలోన్న బంటు కార్తీక్ పై గతంలో అనేక క్రిమినల్ కేసులు నమోదై కాగా టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతనిపై రౌడీషీట్ కూడా ఉందని, మహమ్మద్ అబ్దుల్ నయీమ్ పై గతంలో హైదరాబాద్ మంగళహాట్ పోలీస్ స్టేషన్ లో ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వై.సైదులు, సిబ్బంది ఎల్.బాలకోటి, ఎండీ.షకీల్, మహేష్, వీరాంజనేయుల పాల్గొన్నారు.

## మాజీ ఐపిఎస్ భార్య కేసులు దర్యాప్తు ముమ్మరం

**తనూజ భౌతిక కాయానికి డిజిపి ఆనంద్ నివాళి**

హైదరాబాద్,మే9(సాక్ష్యం): విశ్రాంత ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య తనూజ హత్య కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజామున నేపాలీ గ్యాంగ్ ఆమెను హత్య చేసి బంగారం, నగదుతో ఉడాయించింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు విచారణను వేగవంతం చేశారు. తనూజను హత్య చేసి పారిపోయిన పని మనిషి కల్పన అండ్ గ్యాంగ్ కోసం 10 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇప్పటికే నేపాల్‌తో పాటు ముంబై, లక్నో,



ఢిల్లీకి పోలీసు బృందాలు చేరుకున్నాయి. పని మనిషి కల్పన చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో లక్నోలో కల్పన పని చేసిన ఇంటికి వెళ్లి ఆమె గురించి యజమానులను ప్రశ్నించారు. అయితే, తమ ఇంట్లోనూ భారీగా బంగారం, వెండి, నగదు మాయమైనట్లు పోలీసులకు వారు తెలిపారు. కల్పనతో ఉన్న ఇద్దరు యువకుల గురించీ కూపీ లాగుతున్నారు. హత్య అనంతరం ముగ్గురు నిందితులు నాంపల్లిలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మాజీ ఐపీఎస్ ఇల్లు, నాంపల్లి రైల్వేస్టేషన్ సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. శనివారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో తనూజ అంత్యక్రియలు జరిగాయి. మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య మృతదేహానికి తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సహా పలువురు ఉన్నతాధికారులు నివాళులు అర్పించారు.

**CHANGE OF NAME**

I, **MOHAMMED NEHAL AHMAD, S/o. MOHAMMED NASEEM AHMAD (Old Name),** H.No. 19-2-99, Komati Veedhi, Rangashaipet, Warangal Dist- 506 002, TG, have changed my name from **MOHAMMED NEHAL AHMAD, S/o. MOHAMMED NASEEM AHMAD** to **MOHAMMAD NEHAL AHMED, S/o. MOHAMMAD NASEEM AHMED (New Name)** for all future purposes.

**CHANGE OF NAME**

I, **MOHAMMED NASEEM AHMED, S/o. AMJAD (Old Name),** H.No. 19-2-99, Komati Veedhi, Rangashaipet, Khila Warangal (M), Warangal Dist-506 005, T.G, have changed my name from **MOHAMMED NASEEM AHMED** to **MD. NASEEM AHMED, S/o. MD. AMZAD ALI (New Name)** for all future purposed.

**CHANGE OF NAME**

I, **SHABANA (Old Name),** H.No. 19-2-99, Komati Veedhi, Rangashaipet, Khila Warangal, Warangal Dist-506 005, T.G, have changed my name from **SHABANA** to **SHABANA SULTANA (New Name), W/o. MOHAMMED NASEEM AHMED** for all future purposes.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి నా క్లయింట్లు **శ్రీ సోమీర్ కుమార్ ధార తండ్రి లేట్ సూరజ్ కుమార్ ధార** తెలియజేయడమేమనగా క్రింద తెలిపిన షెడ్యూల్ ఆస్తికి సంబంధించిన యజమాని షెడ్యూల్ ఆస్తిపై తనఖా సృష్టించి బ్యాంకులు/ఆర్థిక సంస్థల నుండి ఋణము పొందుటకు ఉద్దేశించినారు. కావున ఒక వేళ ఏవరైన వ్యక్తికి సదరు లావాదేవీలపై ఏదైన క్లయిము/ ప్రయోజనము/ వివాదములున్నచో ఈ ప్రచురణ తేదీ నుండి 7 (ఏడు) రోజులలోగా క్రింది సంతకముదారుకు తెలియజేయడమైనది. విఫలమైనచో ఎటువంటి తదుపరి క్లయిములు/ అభ్యంతరములను అనుమతించబడవు మరియు నా క్లయింట్ దానికి సంబంధించి ముందుకు సాగెదరు.

**ఆస్తి యొక్క షెడ్యూల్**

తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, ఖోకర్వాడి షక్కర్ కొత్త వద్ద 42.09 చ॥గ॥లు లేదా దానికి సమానమైన 35.19 చ॥మీ॥ల విస్తీర్ణము (84.18 చ॥గ॥లలోనిది)తో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు & రెండవ అంతస్తు, బిల్టప్ ఏరియా 657.50 చ॥అ॥ల గ్రౌండ్ ఫ్లోర్ (1/2 వాటా అంటే 328.75 చ॥అ॥లు), 657.50 చ॥అ॥ల మొదటి అంతస్తు (1/2 వాటా అంటే 328.75 చ॥అ॥లు), 657.50 చ॥అ॥లు గల రెండవ అంతస్తు (1/2 వాటా అంటే 328.75 చ॥అ॥లు) కలిగి ఉన్న ఇంటి మున్సిపల్ నెం. 21-7-490/1 పడమటి భాగము (పిటిఐఎన్ నెం. 1052104032) యావదాస్తి. సరిహద్దులు: **ఉత్తరం:** 11’-0” వెడల్పు లేన్, **దక్షిణం:** పొరుగువారి ఇల్లు, **తూర్పు:** మొదటి పార్టీకి కేటాయించిన ఇంటి భాగము, **పడమర:** పొరుగువారి ఇల్లు.

**పి. సంతోష్ కుమార్, న్యాయవాది**
నెం. 1-8-506/2/ఎ/1, అద్నాన్ ఛాంబర్స్,
ప్రకాష్‌నగర్, బేగంపేట,
సికింద్రాబాద్-500016.
**సెల్: 9440067560**

## చంద్రబాబు, పవన్ నివాసాలకు మోదీ

హైదరాబాద్,మే9: ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నగరంలోని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసాలకు ప్రధాని వెళ్లే అవకాశముంది. ఇప్పటికే చంద్రబాబు, పవన్ నివాస మార్గాల్లో భద్రతా సిబ్బంది ప్రధాని కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. పవన్ కళ్యాణం ముక్కు సర్జరీతో రెస్ట్ తీసుకుంటున్నారు. చంద్రబాబు శనివారం బెంగాల్ సిఎం సువేందు అధికారి ప్రమాణానికి కూడా హాజరయ్యారు.

## ఎపిలో పలువురు ఐఎఎస్‌ల బదిలీలు

అమరావతి,మే9: ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఐఏఎస్ అధికారుల బదిలీలు, అదనపు బాధ్యతలపై శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న శశి భూషణ్ కుమార్‌కు జలవనరుల శాఖ బాధ్యతలు అప్పగించింది. జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్, ఫుల్ అడిషనల్ ఛార్జ్ బాధ్యతల నుంచి సీఎస్ సాయి ప్రసాద్‌కు ప్రభుత్వం రిలీఫ్ ఇచ్చింది. పర్యావరణ, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు జీఓ ఆర్టీ నెంబర్ 918ను సీఎస్ జి.సాయి ప్రసాద్ జారీ చేశారు.

## ఆల్మాస్‌పేటకు టిప్పు సర్కిల్‌గా పేరు

**ఆందోళనకు దిగిన హిందూ సంఘాలు**

**ఇరువర్గాల దాడులతో ఉద్రిక్తం..పోలీసుల లాఠీఛార్జ్**

కడప,మే9: నగరంలోని ఆల్మాస్ పేట సర్కిల్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా మార్చడంపై వివాదం చెలరేగింది. ఆల్మాస్ పేట సర్కిల్‌కు టిప్పు సుల్తాన్ పేరు పెట్టడాన్ని ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. హనుమాన్ సర్కిల్‌గా మార్చాలని పట్టుబడుతోంది. టిప్పు సుల్తాన్ పేరును కొనసాగించాలని మరో వర్గం ఆందోళనకు దిగింది. దీంతో సర్కిల్ వద్ద ఇరువర్గాలు ఆందోళనకు దిగాయి. ఇరువర్గాలకు చెందిన మద్దతుదారులు భారీగా అక్కడకు చేరుకున్నారు. సమాచారం అందిన వెంటనే పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు అక్కడకు చేరుకున్నాయి. రెచ్చిపోయిన ఇరువర్గాలు పరస్పరం రాళ్ల దాడులకు దిగాయి. ఈ దాడుల్లో తాలూకా సీఐ నరసింహారావు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే పోలీసులు లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

## డిప్యూటి సిఎం పవన్ చొరవ

మస్కట్ నుంచి సొంతూరుకు చేరిన మహిళ

అన్నమయ్య,మే9: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో ఏపీకి చెందిన మహిళ మస్కట్ నుంచి క్షేమంగా స్వగ్రామానికి చేరుకుంది. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలానికి చెందిన షెహనాజ్ కుటుంబ జీవనం కోసం ఏజెంట్ ద్వారా మస్కట్‌కు వెళ్లి చిత్ర హింసలకు గురైంది. తనకు జీతం ఇవ్వడం లేదని, వేధింపులకు గురిచేస్తున్నారంటూ భర్తకు వీడియో కాల్ చేసి చెప్పింది. తనను రక్షిచాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌ను వేడుకుంది. షెహనాజ్ బాధలు విన్న వెంటనే డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. మహిళను స్వగ్రామానికి రప్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ అధికారులకు ఆదేశించారు. ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి చొరవతో షెహనాజ్ స్వగ్రామానికి చేరుకుంది. కేవలం ఐదు రోజుల్లోనే మస్కట్ నుంచి మహిళను స్వగ్రామానికి డిప్యూటీ సీఎం పేషీ అధికారులు చేర్చారు. మస్కట్ నుంచి ముంబైకి అటు నుంచి విజయవాడకు వాల్మీకిపురం మహిళ షెహనాజ్ చేరుకుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పేషీ అధికారులు.. మహిళకి రూ 30,000 నగదు, చీర బహూకరించి సురక్షితంగా స్వగ్రామానికి పంపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి షెహనాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తనను సమస్యల నుంచి రక్షించి స్వగ్రామం చేర్చడంతో పాటు ఆర్థిక సహాయం అందించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపింది.

## పర్యాటకులకు కనువిందు

కైలాసగిరిపై త్రిశూల్ ప్రారంభం

విశాఖపట్నం,మే9: విశాఖ కైలాసగిరికి అదనపు ఆకర్షణ వచ్చింది. పర్యాటకులకు విందుచేసేలా తీర్చిదిద్దారు. పర్యాటకులను ఆకట్టుకునేలా విశాఖలోని కైలాసగిరిపై రూ.3 కోట్లతో చేపట్టిన 'త్రిశూల్ ప్రాజెక్టు'ను మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రారంభించారు. ఇందులో భాగంగా భారీ త్రిశూలాన్ని ఏర్పాటు చేశారు. తుపాన్లు, ప్రచండ గాలులనూ తట్టుకునేలా దీన్ని నిర్మించారు. త్రిశూలం పొడవు 65 అడుగులైతే... అందులో ఢమరుకం 10 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు ఉంది. నగరంలో వివిధ ప్రాంతాల నుంచి కూడా కనిపించేలా ఎత్తయిన కొండపై నిర్మించడమేగాక.. త్రిశూలం వెలుగులు విరజిమ్మేలా లోపల ఎల్‌ఈడీ దీపాలు అమర్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణు కుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల శ్రీనివాస్, లోకం మాధవి, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## తాగుబోతు చేతిలో కుమారుడు హతం

భీమవరం,మే9: అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో తండ్రి చేతిలో కుమారుడు దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో తండ్రి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.

గ్రామానికి చెందిన గణెళిశ్ ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గణెళిశ్ తరచూ మద్యం సేవించడంతో ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ క్రమంలో అతిగా మద్యం సేవించిన గణెళిశ్ తన కొడుకు శామ్యూల్ రాజు(19)పై దాడి చేశాడు. కత్తెరతో శామ్యూల్‌పై విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. సమాచారం అందిన వెంటనే అత్తిలి పోలీసులు అక్కడకు చేరుకుని నిందితుడు గణెళిశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కన్న కొడుకును తండ్రి అతికిరాతకంగా చంపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా విశాఖ అభివృద్ధి

### రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు
### వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి నారాయణ సమీక్ష

విశాఖపట్నం,మే9: రానున్న 50 ఏళ్లలో విశాఖ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించాం. మాస్టర్‌ప్లాన్ అంశంలో వచ్చిన వినతులపై ఈ సమావేశంలో చర్చించాం. ఎమ్మెల్యేల నుంచి అందిన వినతుల్లో 90 శాతం పరిష్కరించాం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ విస్తరించి ఉంది. ఈనెల చివరి నాటికి సెమీ రింగురోడ్డు డీపీఆర్ సిద్ధమవుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. మాస్టర్ ప్లాన్ మేరకు విశాఖ పట్టాణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరమని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం




నిర్వహించామమని మంత్రి వెల్లడించారు. 'నగరం అభివృద్ధి చెందాలి అంటే మాస్టర్ ప్లాన్ అవసరం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ ఉంది. 4,387.36 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. మిగిలిన ప్రాంతంలో రానున్న అక్టోబర్ నెలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తాం. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై వచ్చిన వినతులపై సమీక్షలో చర్చ జరిపాం. ఎమ్మెల్యేలు తీసుకువచ్చిన వినతులు 90 శాతం పైగా పరిష్కారం చూపాం. 2021లో రూపొందించిన మాస్టర్ ఎ÷-లాన్‌ను రీవిజిట్ చేయాలని ప్రజా ప్రతినిధులు సీఎంను కోరారు. దీనిపై భారీ ఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. తొలుత 3720 అభ్యంతరాలు రాగా రెండవసారి 1236 అభ్యంతరాలు వచ్చాయి. సమీక్షకు హాజరుకాని ఎమ్మెల్యేలతో చర్చించి మాస్టర్ ప్లాన్ ప్రకటిస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు. హైదరాబాద్ తరహాలో విశాఖలో సెమి రింగ్ రోడ్డు నిర్మించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర సెమి రింగ్ రోడ్డు నిర్మాణం. ఈనెల చివరికి సెమి రింగ్ రోడ్డు డీపీఆర్ సిద్ధం అవుతుంది. అలానే భోగాపురం విమానాశ్రయంకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రాపర్టీ టాక్స్ విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తున్నాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఎకనామిక్ కారిడార్ ఆధారంగా సమీక్ష సమావేశం జరిగిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుతోందన్నారు.



# దుర్గమ్మను దర్శించుకున్న లోకేశ్

### పూర్ణకుంభ స్వాగతం పలికిన అధికారులు

విజయవాడ,మే9: ప్రముఖ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకిలాద్రిపై కనకదుర్గమ్మను ఐటీ శాఖ మంత్రి, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన మంత్రికి దేవాదాయ కమిషనర్ రాంచంద్ర మోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి చైర్మన్ బొర్ర రాధా కృష్ణ.. పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో లోకేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం లోకేశ్‌కు వేద పండితులు ఆశీర్వాదం అందించగా... అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. లోకేశ్ రాకతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ అభివృద్ధి గురించి అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం కల్పించాలని అధికారులకు తెలిపారు. అనంతరం ఏపీ ప్రభుత్వ సలహాదారులు వేమూరి రవి కుమారు కుమారుడు కిరణ్ వివాహ వేడుకల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు.



## బిజెపి నాయకత్వ పటిమ అమోఘం

**బెంగాల్ సిఎం సువేందుకు పవన్ శుభాకాంక్షలు**

అమరావతి,మే9: పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ చరిత్రాత్మక విజయాన్ని సాధించడానికి సంవత్సరాల తరబడి పోరాటం చేశారన్నారు. దీనికి దృఢంగా నిలిచిన బీజేపీ బెంగాల్ నాయకత్వానికి, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. 'ప్రజాకేంద్రిత పాలనను అందించడంలో నూతన బీజేపీ ప్రభుత్వం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. దీనిని కేవలం బీజేపీ లేదా పశ్చిమ బెంగాల్ విజయంగానే కాకుండా, భారత ప్రజల గెలుపుగా భావిస్తున్నాను. సంవత్సరాలుగా హింస, అరాచకం, అక్రమ వలసలు, తీవ్రవాద చొరబాట్లపై పెరుగుతున్న ఆందోళనలకు పశ్చిమ బెంగాల్ సాక్ష్యంగా నిలిచింది. ఇవి సామాజిక సామరస్యం, జాతీయ భద్రతకు




తీవ్రమైన సవాళ్లను విసిరాయి. ఇలాంటి కీలక సమయంలో జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, బలమైన పాలనతో ఈ సవాళ్లను పరిష్కరించడానికి ఇచ్చిన ఈ ప్రజా తీర్పు గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన దార్శనికుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నా నివాళులు. శ్యామా ప్రసాద్ జన్మస్థలమైన పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయం.. ఆయన దార్శనికత, సిద్ధాంతానికి తగిన నివాళిగా నిలుస్తోంది. ఈ ప్రజా తీర్పు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ అద్భుతమైన విజయానికి దోహదపడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య, ప్రతి బీజేపీ కార్యకర్తకు నా హృదయపూర్వక అభినందనలు' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# విధ్వంసం నుంచి వికాస దిశగా పయనం

### భయం నుంచి భరోసా దిశగా రాష్ట్రం అభివృద్ధి: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అమరావతి,మే9: విధ్వంస పాలన నుంచి వికాస పాలన వైపు రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 23 నెలల కూటమి పాలనలో భయపెట్టే రాజకీయాలకు ముగింపు పలికి, భరోసా కలిగించే పరిపాలన అందుతోందన్నారు. వైసీపీ హయాంలో ప్రజల సమస్యలు చెప్పుకోవడానికే భయపడేవారని.. నేడు ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేదని.. నేడు గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు గుర్తుకొస్తున్నాయని మంత్రి అన్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో గంజాయి తోటల




స్థానంలో కాఫీ తోటలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడం కూటమి ప్రభుత్వ చరిత్రాత్మక విజయంగా చెప్పుకొచ్చారు. యువత చేతిలో ఆయుధాలు కాదు.. ఉద్యోగాలు, నైపుణ్యాలు, అవకాశాలు ఉండాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో గొప్ప సంఘటనన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర సహకారంతో వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని సంధ్యారాణి అన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టామని తెలిపారు. జగన్‌కు ఇంట్లో వారిపైనే గౌరవం లేదని.. ఇక ప్రజలపై గౌరవం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అధికార దాహం కోసం యువత చేతికి కత్తులు, గొడ్డళ్లు ఇచ్చే వైసీపీ నేతల మోసపూరిత మాటలకు బలికావొద్దని.. కోడికత్తి శ్రీను ఉదంతాన్ని గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. సూపర్ 6 పథకాలు గిరిజనులకు ఎంతగానో తోడ్పడుతున్నాయని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు.

## అమెరికాలో హైదరాబాద్ యువతి మృతి

### కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

హైదరాబాద్,మే9(సాక్ష్యం): అమెరికాలో స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ఓ తెలుగు యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదం రేపింది. వర్జీనియాలో నివాసముంటున్న వీణ అనే యువతి మరణంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రెండు రోజుల క్రితం ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఫ్లోరిడా వెళ్లిన ఆమె.. అక్కడే స్విమ్మింగ్ పూల్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వీణ తల్లిదండ్రులు దేవేందర్ రెడ్డి–సునీత ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్‌లో నివాసం ఉంటున్నారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమార్తె మరణ వార్తతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదం గురించి తెలుసుకున్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నేరుగా వీణ తల్లిదండ్రులు ఉంటున్న నివాసానికి వెళ్లారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీణ భౌతిక కాయాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆ కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

## అనిల్ అంబానీ కార్యాలయాల్లో సీబీఐ సోదాలు

ముంబై,మే9(సాక్ష్యం): ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు చేపట్టింది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ÷నాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ÷నాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిపినట్లు తెలుస్తోంది. బ్యాంక్ మోసం కేసు (శిజీనీ ÷బిసజీబీట ఇజీబ!)లో ముంబయిలోని ఆయనకు సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) శనివారం తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయాల్లోనూ సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీబీఐ ఇప్పటికే పలుమార్లు అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది.

## ఎలుకల మందుతాగి డ్రైవింగ్

### ప్రమాదానికి గురైన ఆటో డ్రైవర్

సంగారెడ్డి,మే9(సాక్ష్యం): జిల్లాలోని చౌటకూర్ వద్ద జాతీయ రహదారి 161పై శనివారం రోడ్డు ప్రమాదం చోటు జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆటో నడపడం.. ప్రమాదానికి దారితీసింది. మందు ప్రభావంతో ఆటోను కంట్రోల్ చేయలేక రోడ్డు పక్కన ఆరబోసిన వరి కుప్పలను ఢీకొట్టడంతో వాహనం బోల్తా పడింది. సదరు ఆటో డ్రైవర్ గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన అతను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని, ఎలుకల మందు తాగి ఆటో నడిపాడు. ఆటో చౌటకూర్ శివారులోకి రాగానే డ్రైవర్ అస్వస్థతకు గురవడంతో వాహనం నియంత్రణ కోల్పోయింది. రోడ్డుపైనే ఉన్న వరి కుప్పలపైకి దూసుకెళ్లడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీశారు. అతని వద్ద ఉన్న కాగితాలను పరిశీలించగా, తన ఆత్మహత్యాయత్నానికి కారణమైన కొందరు వ్యక్తుల పేర్లను అందులో రాసి ఉన్నట్లు గుర్తించారు. బాధితుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పుల్కల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు, ఆ లేఖలో ఉన్న వ్యక్తుల వివరాలపై విచారణ చేస్తున్నారు.

## నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం..

నిజామాబాద్,మే9(సాక్ష్యం): నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఓ ఇసుక లారీ.. ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

## క్లాస్‌లో డెమో ఇస్తూ కుప్పకూలిన టీచర్

### గెండెపోటుతో మృతి చెందినట్లు గుర్తింపు

ఖమ్మం,మే9(సాక్ష్యం):
జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. క్లాస్ రూమ్ లో డెమో ఇస్తూ గుండెపోటుతో కుప్పకూలాడు ఓ ఉపాధ్యాయుడు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..
ఖమ్మం జిల్లా మధిరలో చోటు చేసుకుంది ఈ విషాద ఘటన. జిల్లాలోని మధిర పట్టణం రెండోవార్డు ఎంఎ÷–లాయిన్ కాలనీకి చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గారపాటి జయరాజ్ ఖమ్మంలోని మమతా రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ లో వర్క్ షాప్ కి హాజరయ్యాడు. వర్క్ షాప్ లో భాగంగా క్లాస్ రూమ్ లో డెమో ఇస్తుండగా గుండెపోటుతో కుప్పకూలాడు జయరాజ్. డెమో ఇస్తున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో అతనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు సహా ఉపాధ్యాయులు. అయితే.. అప్పటికే జయరాజ్ మరణించినట్లు తెలిపారు డాక్టర్లు. జయరాజ్ డెమో ఇస్తూ కుప్పకూలిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. జయరాజ్ మరణంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అప్పటిదాకా హుషారుగా పాఠం చెబుతున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడం జీర్ణించుకోలేక పోతున్నామని అంటున్నారు తోటి ఉపాధ్యాయులు. ఈ ఘటనతో మధిర పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

మొదటిపేజీ తరువాయి..

స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహుతుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు.గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు. సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోయారు.

## వేగంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి


### యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష

నల్లగొండ,మే9(సాక్ష్యం): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శనివారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యే బాలు నాయక్‌తో కలిసి కలెక్టర్ డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గ పరిధిలో 15 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 457 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ముందస్తు అంచనా వేసినట్లు చెప్పారు. మిగిలిన ధాన్యం కొనుగోళ్లు వచ్చే 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ.487 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. దేవరకొండ డివిజన్ పరిధిలోని 12 మిల్లులకు చెందిన మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలన్నారు. అదనంగా 30 లారీలను పెంచామని, ప్రస్తుతం మొత్తం 100 లారీలతో 24 గంటల వ్యవధిలో ధాన్యం అన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఇన్‌చార్జి ఆర్డీఓ రమణారెడ్డి, డీఎస్ఓ వెంకటేష్, డీఎం రాంపత్తి నాయక్, డీసీఓ పత్యా నాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, తాసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డీటీ ముబీన్, రైస్ మిల్లర్ల తరఫున వెంకన్న, శ్రీనివాస్, అధికారులు హాజరయ్యారు.


## కో ఆపషన్ సభ్యుల ఎంపికలో అన్యాయం

### ప్రశ్నించిన బిఆర్ఎస్ నేతలపై కేసులు

జోగులాంబ గద్వాల,మే9(సాక్ష్యం): ప్రశ్నించే వారిపై ప్రభుత్వం అక్రమ కేసులను పెడుతోందని బిఆర్ఎస్ ఆరోపించింది.హక్కుల సాధనకు నిలదీస్తున్న సామాన్యుడి నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఏదో ఒక రంగా ఇబ్బందులపాలు చేస్తుందన్నారు. గద్వాల మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని కమిషనర్‌ను నిలదీసిన 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పులిపాటి వెంకటేశ్, జగదీష్, గువ్వలగోపాల్, మోహన్ యాదవ్, సంటేన్న ,చిన్న రాముడు,నరసింహ కమ్మరి సునీత గంగాళం మంజుల రాణి,లత , బీఆర్ఎస్ నాయకుడు చిత్తారి కిరణ్ పై పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, పోలీసుల తీరును నిరసిస్తూ కౌన్సిలర్లు శనివారం నిరసన తెలిపారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ చట్టబద్ధంగా జరగాల్సిన ఎన్నికను ఎన్నిక నియమావళికి విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కో ఆప్షన్ ఎన్నికలలో భాగంగా గత నెల 23న నామినేషన్ దాఖలు కు చివరిరోజు కావడంతో నామినేషన్ పత్రాలను స్వీకరించడానికి మున్సిపల్ కార్యాలయంలో ఏ అధికారి లేక పోవడం, దానికి ఒక విభాగాన్నికూడా ఏర్పాటు చేయకపోవడంపై మున్సిపల్ కమిషనర్‌ను అడిగామని తెలిపారు. పోలీస్ అధికారులను తప్పుదారి పట్టించి మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించకున్నా తమపై తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. కౌన్సిలర్లుగా తమ హక్కుల కోసం ప్రజల పక్షాన ఖచ్చితంగా కమిషనర్‌ను నిలదీస్తామని, తప్పుడు పని చేసే ప్రతి అధికారిని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.



# ప్రణాళికబద్ధంగా నగరాభివృద్ధి





మొదటిపేజీ తరువాయి..

కున్నామని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్–2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.

# నూతన సీడీఎస్‌గా రాజా సుబ్రమణి

మొదటిపేజీ తరువాయి..

అనిల్ చౌహాన్ మే 30న పదవీ విరమణ చేయనుండగా, ఆయన స్థానంలో సుబ్రమణి బాధ్యతలు చేపడతారు. ఈయన సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు భారత ప్రభుత్వ సైనిక వ్యవహారాల విభాగం కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తారు. ఇక, నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి మే 31న పదవీ విరమణ చేయనుండటంతో కృష్ణ స్వామినాథన్ ఆ పదవిని అలంకరించనున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) పూర్వ విద్యార్థి అయిన సుబ్రమణి, 1985లో గర్వాల్ రైఫిల్స్‌లో సైన్యంలోకి ప్రవేశించారు. 35 ఏళ్లకు పైబడిన తన సుదీర్ఘ కెరీర్‌లో అనేక కీలక పదవులు చేపట్టారు. ఆర్మీ వైస్ చీఫ్‌గా, సెంట్రల్ కమాండ్ చీఫ్‌గా, మిలిటరీ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ, మద్రాస్ యూనివర్సిటీ నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఫిల్ పూర్తిచేశారు. కజకిస్థాన్‌లోని భారత రాయబార కార్యాలయంలో డిఫెన్స్ అటాషెగా కూడా సేవలందించారు. సైన్యానికి చేసిన విశిష్ట సేవలకు గానూ పరమ విశిష్ట సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, సేనా మెడల్, విశిష్ట సేవా పతకం వంటి పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు.నౌకాదళ నూతన అధిపతిగా నియమితులైన వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ 1987లో నేవీలో చేరారు. ఈయన కూడా ఎన్డీఏ పూర్వ విద్యార్థే. తన కెరీర్‌లో ఐఎన్ఎస్ విక్రమాదిత్య అనే విమాన వాహక నౌకతో పాటు పలు క్షిపణి నౌకలకు కమాండర్‌గా వ్యవహరించారు. వెస్ట్రన్ ఫ్లీట్ కమాండర్‌గా, నేవీ వైస్ చీఫ్‌గా, సదరన్ నేవల్ కమాండ్‌లో చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. నేవీలో శిక్షణ ప్రమాణాలను మెరుగుపరచడంలో, ఆపరేషనల్ సేఫ్టీని పర్యవేక్షించే ఇండియన్ నేవల్ సేఫ్టీ టీమ్‌ను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలకు గానూ అతి విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకాలను అందుకున్నారు. ఈ రెండు ఉన్నత నియామకాలతో దేశ రక్షణ వ్యవస్థ మరింత పటిష్ఠం కానుందని నిపుణులు భావిస్తున్నారు.



## తెలంగాణ జన సమితి సంస్థాగత ఎన్నికలు



**హైదరాబాదు మే 9 (సాక్ష్యం):** మే 12వ తేదీన హైదరాబాదులో జరిగే తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర 4వ ప్లీనరీ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ నిన్న విడుదలైంది. ఈరోజు ప్రొఫెసర్ కోదండరాంను అధ్యక్షులుగా బలపరుస్తూ 3 సెట్ల నామినేషన్లను పార్టీ నాయకులు దాఖలు చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియకు పార్టీ సీనియర్ నేతలు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు ప్రధాన ఎన్నికల అధికారిగా, మహమ్మద్ అఫ్జల్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 12న హైదరాబాద్లో జరిగే రాష్ట్ర నాలుగవ ప్లీనరీలో నూతన అధ్యక్షుని ఎన్నికను లాంచనంగా ప్రకటించనంన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కుంట్ల ధర్మార్జున్, బైరి రమేష్, నిజ్జన రమేష్, ఆశప్ప, పల్లె వినయ్ కుమార్, యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు సలీమ్ పాషా, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్, కార్మిక విభాగం అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరసయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ధారసత్యం, యూత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్ర వీరన్న, యూత్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొత్త రవి, పార్టీ ఆఫీస్ ఇంచార్జ్ హనుమంత రెడ్డి, భువనగిరి జిల్లా అధ్యక్షులు దేశపాక శ్రీనివాస్, పార్టీ నాయకులు సర్దార్ వినోద్ కుమార్, రసూల్, జహీరుద్దీన్, బాలరాజు తదితరులు హాజరయ్యారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవ సహకార కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నాయకుల హర్షం



**సికింద్రాబాద్, మే 9 (సాక్ష్యం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాదవ సహకార కార్పొరేషన్ ను ఏర్పాటు చేయడమే కాకుండా చైర్మ ను నియమంచడం పట్ల జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు యాదవ సహకార కార్పొరేషన్ చైర్మన్ గా నూతనంగా నియామకమైన ఎం. రఘునాద్ ను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంటల జంగయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవ సామాజికవర్గం సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషను ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం కార్పొరేషన్లను ఏర్పాటు చేయడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని కార్పొరేషన్ కు నిధులు కేటాయించి యాదవ సామాజికవర్గం అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. సీఎం కోకాపేట్లో యాదవ సంఘం భవనాన్ని ప్రారంభించేవిదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షుడు మేలక రాములు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిగే శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు ధనశ్రీ సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు నగర్‌లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమం పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ జ్యోతి




**సికింద్రాబాద్, మే 9 (సాక్ష్యం):** లాలాపేట పరిధిలోని చంద్రబాబు నాయుడు నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ స్టేషన్లు 85 నుంచి 89, 95 వరకు సంబంధించిన ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ జ్యోతి పరిశీలించి అక్కడి ఏర్పాట్లు, మ్యాపింగ్ ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బీఎల్ఓ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టారు. స్థానిక ప్రజలు కూడా కార్యక్రమానికి సహకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోళ్ల వెంకటేష్, కూరెళ్ల నాగరాజ్ గౌడ్, సునీల్ ముదిరాజ్, నాగేశ్వర్ రావు గౌడ్, మల్లికార్జున్, ఎర్ర నాగు, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ లాల్, కిషోర్ యాదవ్ హాజరై కార్యక్రమాన్ని పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల సహకారంతో కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.



## గ్రామ ప్రజలందరికీ దేవతల అనుగ్రహం, దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి

– భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





**(సాక్ష్యం) న్యూస్ రేగొండ, మే 9 :** గ్రామ ప్రజలందరికీ దేవతల అనుగ్రహం, దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. భూపాలపల్లి నియోజకవర్గంలోని కొత్తపల్లి గోరి మండలంలోని విజయ్యపల్లి గ్రామంలో భూలక్ష్మి మహాలక్ష్మి ,ఆంజనేయ స్వామి ఆలయం లో నవ గ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ దేవతల అనుగ్రహం, దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు.గ్రామ ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. గ్రామంలో శాంతి, సుఖసంతోషాలు, ఐకమత్యం నెలకొని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించిన గ్రామ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.


## “వరల్డ్స్ బెస్ట్ హాస్పిటల్స్ 2026లో” యశోద హాస్పిటల్స్ గ్రూప్‌కు ప్రముఖ స్థానం


WORLD'S BEST HOSPITALS
Newsweek
Certificate
Yashoda Hospitals - Somajiguda
World's Best Hospitals 2026





statista
Newsweek






YASHODA HOSPITALS



**హైదరాబాద్, మే 9 (సాక్ష్యం):** యశోద హాస్పిటల్స్ గ్రూప్-హైదరాబాద్, ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ న్యూస్ వీక్ ఉ స్టాటిస్టా ఆధ్వర్యంలో ప్రకటించిన “వరల్డ్స్ బెస్ట్ హాస్పిటల్స్ 2026” ర్యాంకింగ్స్ జాబితాలో ప్రముఖ స్థానం సంపాదించి, భారతదేశంలోని అత్యుత్తమ ఆసుపత్రులలో కూడా ఒకటిగా ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపును యశోద హాస్పిటల్స్ గ్రూప్ వరుసగా 8వ సంవత్సరం కూడా సాధించడం ద్వారా ఆరోగ్య రంగ సేవలలో తమ నిబద్ధత, నాణ్యతా ప్రమాణాలు, విశ్వసనీయతను మరోసారి నిరూపించింది. 2026 సంవత్సరానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా 2,780 ఆసుపత్రులను విశ్లేషించి ఈ ర్యాంకింగ్స్ రూపొందించబడ్డాయి. ఇందులో వైద్య సేవల నాణ్యత, రోగుల అనుభవం, ఆధునిక వైద్య సాంకేతికత, క్లినికల్ ప్రతిభ వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో యశోద హాస్పిటల్స్ గ్రూప్ ప్రముఖ స్థానం పొందడం, భారతీయ ఉ తెలుగు రాష్ట్రాల వైద్య రంగంలో యశోద హాస్పిటల్స్ గ్రూప్ సాధించిన ప్రపంచస్థాయి విశిష్టతను, గౌరవాన్ని ప్రతిబింబించింది. ప్రత్యేకంగా, “వరల్డ్స్ బెస్ట్ హాస్పిటల్స్ 2026” జాబితాలో తెలుగు రాష్ట్రాల నుండి కేవలం 7 ఆసుపత్రులు మాత్రమే చోటు దక్కించుకోగా, అందులో యశోద హాస్పిటల్స్ గ్రూప్ కు చెందిన సోమాజిగూడ, సికింద్రాబాద్ మరియు మలక్ పేట్ యశోద మూడు ఆసుపత్రులు, భారతదేశంలోని టాప్ 100 అత్యుత్తమ ఆసుపత్రులు మరియు ప్రపంచ ది బెస్ట్ ఉ అత్యుత్తమ ఆసుపత్రుల జాబితాలో ప్రముఖ స్థానం సంపాదించడం విశేషంగా తెలుగు రాష్ట్రాల కు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ శ్రీ గోరుకంటి రవీందర్ రావు మాట్లాడుతూ , ఈ “వరల్డ్స్ బెస్ట్ హాస్పిటల్స్ 2026” గుర్తింపు ద్వారా యశోద హాస్పిటల్స్ ప్రపంచస్థాయి ఆరోగ్య సేవలను అందించే విశ్వసనీయ భారతీయ ఆరోగ్యసంస్థగా మరోసారి నిలిచిందన్నారు. ఈ గుర్తింపు మా నిరంతర కృషికి, ప్రపంచ స్థాయి వైద్య సేవలను భారత దేశ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే మా అంకితభావానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. వరుసగా 8వ సంవత్సరం ఈ అత్యున్నత గౌరవం దక్కడం మా వైద్య బృందం, సిబ్బంది ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజలందరికి ఎంతో గర్వకారణమన్నారు. ఆధునిక సాంకేతికత, అత్యుత్తమ వైద్య నిపుణుల వైద్య సేవలు మరియు మానవతా దృక్పథంతో రోగుల ఆరోగ్య ఫలితాలను మరింత మెరుగుపరచేందుకు మేము నిరంతరం కృషి చేస్తూనే ఉంటామన్నారు. యశోద హాస్పిటల్స్ గ్రూప్ ఎల్లప్పుడూ అత్యుత్తమ ప్రపంచ స్థాయి వైద్య సేవలు ప్రజలకు అందించడంపై ఎప్పటికీ దృష్టి పెట్టిందన్నారు. మా వైద్యులు, సిబ్బంది అంకితభావం మరియు కోట్లాది రోగుల అపార విశ్వాసం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగాం,” అని యశోద హాస్పిటల్స్ చైర్మన్ శ్రీ గోరుకంటి రవీందర్ రావు తెలిపారు. యశోద హాస్పిటల్స్ గ్రూప్ గురించి 1989 లో సోమాజిగూడ – హైదరాబాద్ లో స్థాపించబడిన యశోద హాస్పిటల్స్ గ్రూప్ నాలుగు దశాబ్దాలుగా భారతదేశం లోని ప్రముఖ మల్టీ-స్పెషాలిటీ ఆరోగ్య సేవా సంస్థలలో ఒకటిగా నిలిచింది. గత 37 సంవత్సరాలుగా నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ దేశ విదేశాల రోగుల విశ్వాసాన్ని సంపాదించింది. సోమాజిగూడ, సికింద్రాబాద్, మలక్ పేట్ మరియు హైటెక్ సిటీ ప్రాంతాల్లోని 4 స్వతంత్ర ఆస్పత్రులు, 4500కి పైగా పడకలతో ప్రపంచ స్థాయి అత్యాధునిక వైద్య సదుపాయాలను అందిస్తోంది. అత్యాధునిక సాంకేతికత, అత్యుత్తమ నిపుణుల వైద్య సేవలు, మానవీయ దృక్పథంతో అందుబాటులో ప్రపంచ స్థాయి వైద్య సేవలను యశోద హాస్పిటల్స్ గ్రూప్ ప్రజలకు అందిస్తోంది.

**For further information, please contact Mr.Sampath on 78930 53355 / 88971 96669**

### రహేజా విస్టా అపార్ట్మెంట్స్ వద్ద రహదారి భద్రతా

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి అపార్ట్మెంట్ వాసుల వినతి



**సికింద్రాబాద్, మే 9 (సాక్ష్యం):** నాచారం పారిశ్రామికవాడలోని రహేజా విస్టా అపార్ట్మెంట్స్ సమీపంలో నెలకొన్న రహదారి భద్రతా సమస్యల పరిష్కారం కోసం అపార్ట్మెంట్ వాసులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. అపార్ట్మెంట్ వాసులు మాట్లాడుతూ రహేజా విస్టా అపార్ట్మెంట్స్‌లో సుమారు 900 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. అపార్ట్మెంట్స్ ముందు ఉన్న ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనాలు అతివేగంగా దూసుకెళ్తున్నాయని, దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అపార్ట్మెంట్స్‌లోకి వెళ్లే వారికి, బయటకు వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఇటీవల కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డుపై తక్షణమే జీబ్రా లైన్స్ ఏర్పాటు చేసి, రహదారి భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వెంటనే టీఎస్ఐఐసీ కమిషనర్ ప్రభాకర్‌కు ఫోన్ చేసి, సంబంధిత ప్రాంతంలో అత్యవసరంగా జీబ్రా లైన్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రహేజా అపార్ట్మెంట్ వాసులు మనోజ్ మనోరంజన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, బాలరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాని నరేంద్ర మోడి భారీ

## బహిరంగ సభను జయప్రదం చేయండి

– బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ ఊరటి మునేందర్



**భూపాలపల్లి (సాక్ష్యం) న్యూస్ మే 9** భారత ప్రధానమంత్రి గా నరేంద్ర మోదీ మూడోసారి గెలిచిన తరువాత తెలంగాణకు మొదటిసారిగా విచ్చేస్తున్న సందర్భంగా రేపు హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించ తలపెట్టిన భారత ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు భూపాలపల్లి జిల్లా ప్రజలు,పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మీడియా కన్వీనర్ ఊరటి మునేందర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీ ఈ సభకు వస్తున్నారని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ వైపు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ బహిరంగ సభ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి బీజేపీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు,శక్తి కేంద్ర ఇన్చార్జిలు,బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

### రహదారులపై

## ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

ప్రమాదాలకు కారణమైతే
చట్టపరమైన చర్యలు తప్పవు: డీఎస్పీ వెంకటేశ్వర్లు



**మహబూబ్‌నగర్, మే 09 ( సాక్ష్యం బ్యూరో )** రహదారులపై ధాన్యం ఆరబోయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. జిల్లాలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుం డటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయని చెప్పారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో లేదా వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు కోరారు.

## వర్తక సంఘం రద్దు చేయడం అంటే ఒకరి పొట్ట కొట్టడమే

– ఉన్న దుకాణాలను కొనసాగిస్తూనే.. నిరుద్యోగులకు మరిన్ని దుకాణాలు వచ్చేలా కృషి చేద్దాం

– బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి




**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..** యాదగిరిగుట్ట దేవస్థానం కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయడం అంటే ఉపాధి పొందుతున్న పేదల మధ్య తరగతి వారి పొట్ట కొట్టడమేనని అలా కాకుండా ఉన్న దుకాణాలను కొనసాగిస్తూనే స్థానిక నిరుద్యోగ యువతకు అదనంగా దుకాణాలు వచ్చేలా దేవస్థానం వారితో ప్రభుత్వంతో పోరాడుదాం అని బి ఆర్ ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరీలు అన్నారు. శనివారం వారు యాదగిరిగుట్ట బిఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని కొంతమంది నిరుద్యోగులు పోరాటం చేస్తున్నారని వర్తక సంఘాన్ని రద్దు చేయాలి అని కాకుండా ఉన్న దుకాణాలను కొనసాగిస్తూనే తమకు కూడా దుకాణాలను కేటాయించాలని వారు కోరాలని అన్నారు అలా అయితే తమ మద్దతు కూడా ఉంటుందని అన్నారు 114 దుకాణాలకు గాను ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 500 మంది ఉపాధి పొందుతున్నారని ఉన్నపలంగా వర్తక సంఘాన్ని రద్దుచేసి దుకాణాలను రద్దు చేయడం అంటే వారందరినీ రోడ్డున పడేయడమేనని అన్నారు ఇది సరైన కాదని అన్నారు. నిరుద్యోగులకు యాదగిరిగుట్ట దేవస్థానంలో ఉద్యోగ దుకాణాల ద్వారా వారికి ఉపాధి కల్పించేందుకు అందరం కృషి చేద్దామని అన్నారు. ఇప్పటికైనా దుకాణాలను వర్తక సంఘాన్ని రద్దు చేయాలని వారి ఆందోళనను విరమించుకోవాలని కోరుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు ఆరే శ్రీధర్ గౌడ్, కాంటే కార్ పవన్ కుమార్, ముక్కెర్ల సతీష్ యాదవ్, అంకం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ సభను విజయవంతం చేయాలి

– బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం




**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్** శనివారం రోజు పట్టణంలో బిజెపి ఆధ్వర్యంలో రేపు పరేడ్ గ్రౌండ్ లో జరుగుతున్నటువంటి ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభ విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది దేనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం హాజరవడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాసరి మల్లేశం మాట్లాడుతూ దేశం లో 3 వ సారి బిజెపి అధికారం లోకి వచ్చాక మోడీ మన రాష్ట్రానికి రావడం తొలిసారి భారతదేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా నిలబెట్టిన ఘనత మోడీకి చెందుతుంది. భారతదేశం అంతట కాషాయం చేయాలని దాదాపు అన్ని రాష్ట్రాల్లో బిజెపి బాగా వేస్తుంది. మొన్న జరిగినటువంటి ఎన్నికల్లో కూడా మోడీ మార్క్ రాజకీయం మరొకసారి బయటపడింది ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి అన్ని రాష్ట్రాల్లో బిజెపి కావాలని అంటున్నారు. రాష్ట్రం లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాల ఉద్దేశంతో మోడీ హైదరాబాదుకు వస్తున్నారు. కావున కులమత ప్రాంతం పార్టీ బేధం లేకుండా మోడీ సభకు హాజరుకావాలని పిలుపునిస్తున్నాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్ ,పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ ,మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం ,పట్టణ మాజీ అధ్యక్షులు శ్యాంసుందర్ ,మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ,మందోజు నరేష్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్ మహేష్, కార్యదర్శిలు ఆవుల సత్యనారాయణ ,దొమ్మట ప్రభాకర్ ,సీనియర్ నాయకులు బెలిదే అశోక్ ,శంకర్ ,నవీన్ ,బోడ సురేష్ ,బుచ్చిబాబు ,బండి మహేష్ ,ఆకుల దేవేందర్, రమేష్ , వంశీ, శ్రీనాథ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి
## మహిళా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 9 :** భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి మహిళా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. ఘనపూర్ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కూసు మమత -- మహేందర్ దంపతులు , చిట్యాల మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన సట్ల కవిత -- కుమార్ ఇందిరమ్మ ఇండ్ల హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గృహ ప్రవేశం కార్యక్రమాలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక భద్రత గౌరవప్రదమైన జీవన విధానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. మహిళ సాధికారత ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పేదల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమాడ వీధుల్లో స్వామి అమ్మవార్ల జోడు సేవ





**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధిలో వీకెండ్ సెలవులు రావటంతో యాదాద్రి ఆలయ సన్నిధిలో భక్తులరద్దీ పెరిగింది. వేకువ జామున ఉదయాన్నే స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి భక్తుల రద్దీ పెరగడంతో స్వామి వారి ధర్మ దర్శనంకు 2గంటల సమయం ప్రత్యేక ప్రవేశ దర్శనంకి ఒక గంట సమయంపడుతోంది. క్షేత్ర పరిసరాలు భక్తుల సందడి కనిపిస్తుంది. దర్శన క్యూలైన్లు, ఆలయ మాఢ వీధుల్లు, కళ్యాణకట్ట, పుష్కరిణి, కొండపైబస్టాండ్, వ్రత మండపం ఘాట్ రోడ్డు వెంట భక్తులతో కిటకిటలాడుతున్నవి.. ఆలయంలో స్వామివారి నిత్య కళ్యాణం పర్వంలో సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం వివిధ కైంకర్యాలలో 35,63,636/– ఆదాయం వచ్చినదని ఆలయ అధికారులు తెలిపారు.

### ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
## బహిరంగ సభకు తరలి రావాలి

– మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి



**మాడుగులపల్లి మే 9 సాక్షం;** మాడుగులపల్లి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాదు పరడే గ్రౌండ్ సభ విజయవంతం చేయాలని అన్నారు. దేశంలో మూడవసారి బిజెపి అధికారంలోకి వచ్చాక మోడీ మన రాష్ట్రానికి రావడం తొలిసారి అని భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టిన ఘనత మోడీకి చెందుతుందని అన్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టడానికి మోడీ హైదరాబాదుకు వస్తున్నారని కులమత పార్టీల భేదం లేకుండా ప్రజలందరూ హాజరుకావాలని, బిజెపి కార్యకర్తలు జిల్లా స్థాయి కార్యకర్తలు మొదలుకొని గ్రామస్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ సభకు హాజరుకావాలని అన్నారు.

### పలు వివాహ వేడుకలో
## పాల్గొన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి











**చౌటుప్పల్ మే 9 (సాక్ష్యం)** మునుగోడు ఎమ్మెల్యే, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోక పలు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యారు. చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డు లోని ఎస్ఎం రెడ్డి కన్వెన్షన్ హాల్లో లింగోజిగూడెం కు చెందిన చెరుకు లింగస్వామి గౌడ్, కలమ్మల కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం తంగడపల్లి రోడ్డు లో ఉన్న కళాశ్రీ ఫంక్షన్ హాల్లో 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతగోని శివకుమార్ సోదరి వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. గుడిమల్కాపూర్ లోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో 10 వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు మధు సోదరుడు వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. చౌటుప్పల్ పట్టణంలోని లక్కారంలో ఎస్ ఎం ఆర్ కన్వెన్షన్ హాల్లో జరిగిన బలిజోని బాయి వాస్తవ్యులు జైపాల్ రెడ్డి కోడలు శాగ జంగా రెడ్డి కూతురు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వచనాలు అందించారు. హౌ చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం లోని జయ కన్వెన్షన్ హాల్లో తంగడపల్లి 5వ వార్డు కు చెందిన కొయ్యడ రాములు గౌడ్ కూతురి వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం లోని ఎల్లగిరి స్టేజి వద్ద రెక్కల సత్తిరెడ్డి గార్డెన్లో మసీదు గూడెం కి చెందిన వాకిడి ప్రభాకర్ రెడ్డి కూతురి వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితోపాటు ఆశీర్వదించిన వారిలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బాలు మహీంద్రా, మున్సిపాలిటీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

### శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి
### హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు





**మాడుగులపల్లి, మే 9 సాక్ష్యం;** మాడుగులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో శనివారం నిర్వహించిన శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి వారి గణపతి పూజ, మండప పూజ, మూలమంత్ర జప అనుష్ఠాన హోమ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో ఐక్యత, భక్తి భావాలు పెంపొందుతాయని అన్నారు. శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలుట్ల బాబయ్య, సర్పంచ్ పూర ప్రసన్న రాబర్ట్, అల్లుబెల్లి గోవింద్ రెడ్డి, గుదే శర్మ, సోములు, కర్ర శ్రీనివాస్ రెడ్డి, శ్రీను, రామస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిజిటల్ స్వీయ గణనకు ప్రజలు ముందుకు రావాలి

– జన గణన 2027 స్వీయ గణనలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

– మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం – ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



**మహబూబ్‌నగర్, మే 9 ( సాక్ష్యం బ్యూరో ) :** జన గణన 2027లో భాగంగా అమలు చేస్తున్న డిజిటల్ స్వీయ గణన ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శనివారం తన క్యాంపు కార్యాలయంలో పాల్గొని ల్యాప్‌టాప్ ద్వారా స్వయంగా వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఆన్‌లైన్ పోర్టల్ సెల్ఫ్ ఎనుమరేషన్ పోర్టల్ ద్వారా తన వ్యక్తిగత, కుటుంబ వివరాలను నమోదు చేసిన కలెక్టర్, ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్వీయ గణనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జన గణన ప్రక్రియను సులభతరం చేయడం, పారదర్శకంగా నిర్వహించడం లక్ష్యంగా డిజిటల్ స్వీయ గణన విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు వెబ్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. మే 10వ తేదీ వరకు స్వీయ గణన చేసుకునేందుకు అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కేవలం 15 నిమిషాల్లో జన గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రత్యేకమైన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి జారీ అవుతుందని తెలిపారు. ప్రభుత్వం నియమించిన ఫీల్డ్ ఎన్యుమరేటర్లు మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటికి వెళ్లి వివరాలను ధృవీకరిస్తారని, ఆ సమయంలో ప్రజలు తమ ఎస్ ఈ ఐ డి నంబర్‌ను తెలియజేయాలని సూచించారు. ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు, విద్యార్థులు, వలస కార్మికులు, ప్రయాణాల్లో ఉన్న ప్రజలకు కూడా ఈ విధానం ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ తెలిపారు. స్వీయ గణనలో ఖచ్చితమైన చిరునామా, సరైన వివరాలు నమోదు చేయాలని సూచించిన కలెక్టర్, ప్రజల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. దేశ అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పనలో జన గణన కీలక పాత్ర పోషిస్తుందని, జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## జనగణన-2027 సక్సెస్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద










**వరంగల్,09 మే (సాక్ష్యం)** జనగణన–2027లో భాగంగా నిర్వహించనున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం ఐఎంఏ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రాంరెడ్డి , అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ వో విజయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన అత్యంత కీలకమని తెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానమే సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. మే 10, రాత్రి 12.00 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ముగియనున్నందున ప్రతి ఒక్కరు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. మే 11 నుండి జనగణన ఇంటింటి సర్వే ఉంటుందని ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వనరుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనగణన సమాచారం కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రజలు సరైన వివరాలను నమోదు చేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఐ ఎంఏ హాల్ నుండి పోచమ్మ మైదానం వరకు జనగణన పై నిర్వహించిన అవగాహన ర్యాలీ లో, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పిసిఓ రామిరెడ్డి, సిపిఓ చంద్రకళ, మండలాల తాసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది , ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హనుమాన్ శోభాయాత్ర

– జై శ్రీ రామ్, జై హనుమాన్ అంటూ భక్తుల పారవశ్యంతో హోరెత్తిన ఊరు, వాడ





**వరంగల్,09 మే (సాక్ష్యం)** ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఎన్టీఆర్ నగర్ లో శనివారం ఎన్టీఆర్ నగర్ హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ నగర్ లోని హనుమాన్ దేవాలయం నుండి కాలనీలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్ర నిర్వహిస్తూ.. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో ఎన్టీఆర్ నగర్ ను మారు మోగించారు. డీజే పాటలతో హనుమాన్ భక్తుల ఆటపాటలతో సంబురంగా శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ భక్తులు కొత్తపల్లి యాదగిరి, పిట్ట నగేష్, ల్యాగాల బిక్షపతి, బొల్లం రవి, పల్లెపాటి రమేష్ రెడ్డి, అబ్బరబోయిన కుమార్, గడ్డం వెంకన్న, నాయిని క్రిష్ణ, గాజే నాగరాజు, మారుతి డీజే మధు, జంగిలి సనత్, గంద్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనులు సమీక్షించిన కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీలం శామి రావు





**వరంగల్, 09 మే (సాక్ష్యం)** వరంగల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో అభివృద్ధి చెందుతున్న మెగా టెక్స్టైల్ పార్క్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న పీఎం మిత్ర పథకం వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించేందుకు భారత ప్రభుత్వ టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి నీలం శామి రావు శనివారం వరంగల్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా వారిని హరిత కాకతీయ హోటల్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి పూల మొక్కను అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం టిఎస్ఐఐసీ ఎండి శశాంక్ తో కలిసి జిల్లాలోని మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతి, వర్చువల్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పన, పార్క్ ద్వారా కలిగే ఉపాధి అవకాశాలు, స్థానిక అభివృద్ధిపై అధికారులు విస్తృతంగా చర్చించారు. ఈ పథకం ద్వారా వరంగల్ జిల్లా జాతీయ స్థాయిలో టెక్స్టైల్ రంగంలో ఒక కీలక కేంద్రంగా ఎదగనున్నదని, దీని వల్ల ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి తోడు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెగా టెక్స్టైల్ పార్క్ జోనల్ మేనేజర్ స్వామి వరంగల్ ఆర్డీఓ సుమ సంగం గీసుకొండ తాసిల్దార్లు రియాజుద్దీన్, రాజ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొప్పుల అశోక్ నియామకం

– ప్రజాసేవకు దక్కిన గౌరవం



**సాక్ష్యం మే 9 పాలేరు** తిరుమలాయపాలెం: కాంగ్రెస్ పార్టీ తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడిగా కొప్పుల అశోక్ నియమితులవడం మండల ప్రజలకు గర్వకారణమని పలువురు ప్రజాప్రతినిధులు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా అశోక్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొంటున్నారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన కాలంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడుతున్నారు. ప్రజా సేవలో చూపిన నిబద్ధత, పార్టీ పట్ల ఉన్న అంకితభావం కారణంగానే పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతను అప్పగించిందని అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పాలేరు శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల అశోక్‌కు మండల ప్రజలు, పార్టీ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు మరింత సేవ అందిస్తానని కొప్పుల అశోక్ ఈ సందర్భంగా తెలిపారు.

## ఘనంగా టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య జన్మదిన వేడుకలు



**మాడుగులపల్లి మే 09 సాక్ష్యం;** మాడుగులపల్లి మండల పరిధిలోని కనేకల్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య జన్మదిన వేడుకలను గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ కొండేటి మల్లన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తన వంతు ఎంతో కృషి చేశారని, పార్టీలోను,ప్రభుత్వంలోనూ ఉన్నత స్థాయి శిఖరాలను చేరుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి శంకర్,కందుల అంజయ్య,మాజీ సర్పంచ్ ఎంకన్న, డీలర్ వెంకటేశ్వర్లు,వంశి,వార్డ్ నెంబర్ దుర్గాప్రసాద్,వార్డ్ నెంబర్ వినోద్,చెన్నయ్య,రవి, సతీష్,సైదులు,కరుణాకర్, నాగయ్య గౌడ్,సయ్యద్, నెంబర్ వెంకన్న,నాగరాజు, ఉపేందర్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా దర్బార్

– ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి

– ప్రజా దర్బార్‌లో ప్రజల ఆర్జీలు పరిష్కరించేందుకు పక్కా ప్రణాళిక – మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



**సాక్ష్యం మే 9 పాలేరు** తెలంగాణ రాష్ట్రంలో ప్రజల దీవెనలతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిని కొనసాగిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గంలో నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకొని సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నిర్వహించడం జరుగుతుందని ఒకో మండలంలో మూడు సెక్టార్లుగా విభజించి ఫస్ట్ సెక్టార్లో సుమారు 10 నుంచి 12 గ్రామాలను తీసుకొని ప్రజలందరి సమక్షంలో ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో రాష్ట్ర జిల్లా అధికారులు మండల గ్రామస్థాయి అధికారులు పాల్గొని అక్కడే ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను పలు శాఖల అధికారులకు అప్పగించి త్వరితగదన తమ సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో ఇప్పటికే రెండు సెక్టార్ లలో ప్రజా దర్బార్ ని నిర్వహించగా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మూడో విడత సెక్టార్ ను 15 గ్రామ పంచాయతీల ప్రజా దర్బార్ ను శనివారం నిర్వహించారు.పాలేరు నియోజకవర్గంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ప్రజల నుంచి వచ్చిన ఎక్కువ ఆర్జీలలో భూ సమస్యలు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు వృద్ధాప్య పెన్షన్లు పలు గ్రామపంచాయతీల అభివృద్ధి పనులకు సంబంధించి దరఖాస్తులు అందాయని అతి త్వరలో వాటి పరిష్కారానికి పక్కా ప్రణాళికతో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, రెవెన్యూ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిపిఓ. రాంబాబు, జిల్లా వైద్యశాఖ అధికారి రామారావు, నీటిపారుదల శాఖ సిఈ. మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఈఈ. బాణాల రమేష్ రెడ్డి, హౌసింగ్ ఈఈ శ్రీనివాస్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్ నాయక్, మద్దిలపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి, ఎంపీడీవో ఎస్ కే సిలార్ సాహెబ్, తాహసిల్దార్ లూథర్ విల్సన్, సర్పంచులు కామల్ల సువార్త నల్లమల్ల కీర్తి ధరావత్ సుజాత అజ్మీర నీలిమ గడిపుడి వెంకటనారాయణ కర్నాటి రాజేంద్రప్రసాద్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పట్నా ఐఐటీలో విషాదం.. హైదరాబాద్ విద్యార్థి మృతి..

క్రికెట్ ఆడుతుండగా కరెంట్ షాక్..





**హైదరాబాద్ 09 మే (సాక్ష్యం)** పట్నా ఐఐటీ క్యాంపస్ శనివారం విషాదం చోటుచేసుకుంది. క్రికెట్ ఆడుతున్న సమయంలో స్తంభాన్ని తాకటంతో.. కరెంట్ షాక్ కొట్టి విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. చనిపోయిన విద్యార్థిని హైదరాబాద్‌కు చెందిన హర్షిత్ రాజ్‌గా గుర్తించారు. చందానగర్‌కు చెందిన హర్షిత్ రాజ్.. పట్నా ఐఐటీలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నారు. హర్షిత్ రాజ్ మరణవార్త తెలిసి అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది. బిహార్‌లోని పట్నా ఐఐటీ క్యాంపస్‌లో విషాదం చోటుచేసుకుంది. క్రికెట్ ఆడుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ పోల్ తాకి, కరెంట్ షాక్ కొట్టటంతో హైదరాబాద్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. పట్నా ఐఐటీ క్యాంపస్‌లో కొంతమంది క్రికెట్ ఆడుతున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన హర్షిత్ రాజ్ అనే విద్యార్థి పట్నా ఐఐటీలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతున్న సమయంలో అనుకోకుండా ప్రమాదవశాత్తూ స్తంభాన్ని తాకారు. దీంతో కరెంట్ షాక్ కొట్టి చనిపోయినట్లు క్యాంపస్ వర్గాలు వెల్లడించాయి. శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు పట్నా ఐఐటీసెక్యూరిటీ ఇన్‌ఛార్జి దీపక్ కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. క్యాంపస్‌లో క్రికెట్ ఆడుతున్న సమయంలో హర్షిత్ రాజ్ కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడని.. వెంటనే నేతాజీ సుభాష్ చంద్రబోస్ వైద్య కళాశాలకు తరలించినట్లు తెలిపారు. అయితే అప్పటికే హర్షిత్ రాజ్ చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారని క్యాంపస్ అధికారులు తెలిపారు. హర్షిత్ రాజ్ చనిపోయిన విషయంపై అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుమారుడి మరణవార్త విని హర్షిత్ రాజ్ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అమెరికాలో తెలుగు యువతి మృతి మరోవైపు అమెరికాలో ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్ పూల్ లో మునిగి తెలుగు యువతి ప్రాణాలు కోల్పోయింది. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడలో నివసించే దేవేందర్ రెడ్డి, సునీతల కుమార్తె వీణ.. వర్జీనియాలో నివాసం ఉంటున్నారు. ఓ ఫంక్షన్ కోసం వీణ రెండు రోజుల కిందట ఫ్లోరిడాకు వెళ్లారు. అక్కడే ప్రమాదవశాత్తూ స్విమి ంగ్ పూల్‌లో పడి చనిపోయారు. ఈ విషయం తెలిసి వీణ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె అనుకోని రీతిలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో వీణ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. వీణ కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. వారికి ధైర్యం చెప్పారు. వీలైనంత త్వరగా వీణ భౌతిక కాయాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. యువతి కుటుంబానికి అండగా ఉంటామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# తెలంగాణ మహిళలకు ఇందిరా మహిళా శక్తి భవనాలు



**హైదరాబాద్ 09 మే (సాక్ష్యం)** తెలంగాణ ప్రభుత్వం 22 జిల్లాల్లో రూ.110 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాలను జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించనుంది. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం వీటిని శాశ్వత వేదికలుగా తీర్చిదిద్దారు. ఒక్కో భవనాన్ని 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.5 కోట్లతో నిర్మించారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సమాఖ్యలకు గొప్ప ఊరటనివ్వడమే కాకుండా ఆర్థిక పురోగతికి మార్గం సుగమం చేయనుంది.తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాల (గ్రా౦+ం) బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్మాత్మక అడుగు వేసింది. రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి పేరుతో నిర్మిస్తున్న అత్యాధునిక భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్నాయి. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా వీటిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఈ భవనాలు ఇకపై కేంద్ర బిందువులుగా మారనున్నాయి. ఉమ్మడి పది జిల్లాల్లో ఇప్పటికే భవనాలు ఉండగా.. కొత్తగా ఏర్పడిన 22 జిల్లాల్లో ఒక్కో భవనానికి రూ.5 కోట్ల చొప్పున ప్రభుత్వం మొత్తం రూ.110 కోట్లను కేటాయించింది. సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో ఈ భవనాలను నిర్మిస్తున్నారు. హనుమకొండ, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, సూర్యాపేట, యాదాద్రి వంటి జిల్లాల్లో ఇప్పటికే 17 భవనాల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలిన 5 జిల్లాల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ పర్యవేక్షణలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోంది. ఇప్పటివరకు మహిళా సమాఖ్యలకు సొంత కార్యాలయాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించాలన్నా, శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నా అద్దె భవనాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇకపై ఆ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఈ భవనాల్లో కేవలం కార్యాలయ పనులే కాకుండా, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మార్కెటింగ్ కార్యకలాపాలు కూడా సాగనున్నాయి. జిల్లా స్థాయి సమావేశాలు, సెమినార్ల నిర్వహణకు ఇవి వేదికలుగా నిలవనున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ నాటికి ఏవైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళా సాధికారతకు ఈ భవనాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. జూన్ 2న జరిగే సామూహిక ప్రారంభోత్సవ కార్యక్రమం మహిళా లోకానికి ఒక తీపి గుర్తుగా మిగిలిపోనుందని ప్రభుత్వం చెబుతోంది.

# రిటైర్డ్ డీజీపీ భార్యను చంపి దోపిడీ చేసిన పనిమనిషి



**హైదరాబాద్ 09 మే (సాక్ష్యం)** హైదరాబాద్‌లోని ప్రశాసన్‌నగర్‌లో విశ్రాంత ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య తనూజను నేపాలీ పని మనిషి కల్పన తన అనుచరులతో కలిసి హత్య చేసి దోపిడీకి పాల్పడింది. యజమాని ఊరు వెళ్లిన సమయంలో ఈ ఘాతుకానికి ఒడిగట్టారు. బాధితురాలి చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కడంతో ఆమె ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు పది బృందాలతో నిందితుల కోసం గాలిస్తున్నారు. పని మనుషుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. హైదరాబాద్ ప్రశాసన్‌నగర్‌లో ఒక నేపాలీ పనిమనిషి తన యజమానురాలిని అత్యంత క్రూరంగా హతమార్చి దోపిడీకి పాల్పడింది. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే ఇంట్లో చోటు చేసుకున్న ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. 1986 బ్యాచ్‌కు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే డీజీపీ హోదాలో 2019లో పదవీ విరమణ పొందారు. ఆయన నివాసంలో ఏడాది క్రితం నేపాల్‌కు చెందిన కల్పన పనిమనిషిగా చేరింది. రంజన్ రే తల్లికి సపర్యలు చేస్తూ అందరి నమ్మకాన్ని చూరగొంది. రంజన్ రే తల్లి ఇటీవల మరణించినా.. కల్పనపై ఉన్న నమ్మకంతో పనిలో కొనసాగించారు. అయితే ఆమె లోలోపల దోపిడీకి భారీ పథకాన్ని రచించింది. కొద్దిరోజుల క్రితం రంజన్ రే ప్రకృతి చికిత్స కోసం బెంగళూరు వెళ్లగా.. ఇంట్లో ఆయన భార్య తనూజ (60) మాత్రమే ఉండటాన్ని అదనుగా తీసుకుంది. తన ఇద్దరు తోడు దొంగలను పిలిపించి ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించింది. భద్రతా సిబ్బంది కళ్లుగప్పి ఇంటి వెనుక ఉన్న పార్కు గుండా లోపలికి ప్రవేశించేలా పక్కాగా ప్లాన్ వేసింది. జగురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కల్పన తన ఇద్దరు అనుచరులను లోపలికి ఆహ్వానించింది. ముగ్గురూ కలిసి తనూజ ఉన్న పడకగదిలోకి ప్రవేశించారు. ఆమె నిద్రలేచి అరవకుండా ఉండేందుకు రెండు చేతులు తాడుతో కట్టేసి నోట్లో వస్త్రం కుక్కారు. దీంతో ఆమె తీవ్ర ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకోగా.. నిందితులు బీరువాల్లోని నగదు, నగలను దోచుకుని పారిపోయారు. శుక్రవారం ఉదయం కుమార్తెలు వెళ్లి చూసేసరికి తనూజ అచేతనంగా పడి ఉన్నారు. ప్రాథమిక చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆమె అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని నగర సీపీ వీసీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు సందర్శించి ఆధారాలు సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులు పార్కు గోడ దూకి జర్నలిస్ట్ కాలనీ వైపు పారిపోయినట్లు గుర్తించారు. నిందితులు దేశ సరిహద్దులు దాటి నేపాల్ పారిపోయే అవకాశం ఉండటంతో పోలీసుల ప్రత్యేక బృందాలను యూపీ, బిహార్ సరిహద్దులకు పంపారు. సుమారు పది బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ సందర్భంగా సీపీ సజ్జానర్ మాట్లాడుతూ.. ఇంట్లో పనిమనుషులను చేర్చుకునే ముందు వారి పూర్వాపరాలను పోలీస్ వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా, గతంలోనూ పలు ఇళ్లలో నేపాలీ గ్యాంగులు చోరీలకు పాల్పడ్డాయి. పని మనుషులు, వాచ్‌మెన్లుగా పనిలో చేరుతున్న నేపాలీలు చాలా తెలివిగా చోరీలకు పాల్పడుతున్నారు. యజమానులు లేని సమయాలు చూసి అందినకాడికి దోచుకొని పారిపోతున్నారు. అడ్డొస్తే చంపటానికి కూడా వెనుకాడటం లేదు.

# పూర్తిగా మారిపోనున్న ఐపీఎల్ షెడ్యూల్..

ఐపీఎల్ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్... ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్ ఐపీఎల్ భవిష్యత్తులో మరిన్ని మెరుపులు మెరిపించబోతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్ అభిమానులను అలరిస్తుండగానే, బీసీసీఐ ( రాబోయే సీజన్ల కోసం ఒక భారీ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. ఇకపై ఐపీఎల్ అంటే కేవలం రెండు నెలల సందడి మాత్రమే కాదు.. అంతకు మించి ఉ ఒడబోతోంది.

ముఖ్యంగా మ్యాచ్‌ల సంఖ్య విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా లీగ్ భవిష్యత్తుపై ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాబోయే మీడియా రైట్స్ సైకిల్ (2028 నుంచి) కోసం టోర్నమెంట్ ఫార్మాట్‌లో పెద్ద మార్పులు చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. ప్రస్తుతం ఒక సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు జరుగుతుండగా, 2028 నుంచి ఈ సంఖ్యను ఏకంగా 94కి పెంచబోతున్నారు.

దీనివల్ల ఆటగాళ్లకు సవాలు పెరగడమే కాకుండా, ప్రేక్షకులకు మరిన్ని ఉత్సాహభరితమైన పోరాటాలు చూసే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక




టీమ్ లీగ్ స్టేజ్‌లో 14 మ్యాచ్‌లు ఆడుతోంది. అయితే 2028 నుంచి ఈ సంఖ్య 18కి చేరనుంది. అంటే టోర్నమెంట్ మరికొన్ని రోజులు అదనంగా జరుగుతుంది. పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్ కోసం జరిగే యుద్ధం ఇప్పుడు మరింత రసవత్తరంగా మారనుంది.

మ్యాచ్‌ల సంఖ్య పెరగడం వల్ల ఆటగాళ్ల ఫిట్‌నెస్, జట్ల వ్యూహాలు కూడా మారే అవకాశం ఉంది. మ్యాచ్‌లు పెరుగుతున్నాయి కదా అని కొత్త టీమ్స్ వస్తాయని భావిస్తే పొరపాటే. ఐపీఎల్‌లో ప్రస్తుతానికి ఉన్న 10 జట్లే కొనసాగుతాయని అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు. కొత్త జట్లను ఇప్పుడే చేర్చడం సరైన నిర్ణయం కాదని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే ఉన్న 10 జట్ల మధ్యే మ్యాచ్‌ల సంఖ్యను పెంచి లీగ్‌ను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు. దీనివల్ల నాణ్యమైన క్రికెట్ ప్రేక్షకులకు అందుతుందని బోర్డు ఆశిస్తోంది. మ్యాచ్‌ల సంఖ్యను 94కి పెంచడం వెనుక అసలు కారణం హోమ్ అండ్ అవే ఫార్మాట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయడమే. అంటే ప్రతి జట్టు మరో జట్టుతో రెండుసార్లు తలపడుతుంది. ఒక మ్యాచ్ తన సొంత మైదానంలో ఆడితే, రెండో మ్యాచ్ ప్రత్యర్థి జట్టు మైదానంలో ఆడుతుంది. దీనివల్ల అన్ని జట్లకు సమానమైన అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం గ్రూప్ సిస్టమ్ వల్ల కొన్ని జట్లతో ఒకే మ్యాచ్ ఆడే పరిస్థితి ఉంది, కానీ 2028 నుంచి ఈ లోపం తొలగిపోనుంది.



# చాహల్ వాపింగ్ కలకలం..

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతున్న సమయంలో పంజాబ్ కింగ్స్ ( వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ఒక నెగటివ్ న్యూస్ తో హెడ్ లైన్స్ లోకి వచ్చాడు. విమాన ప్రయాణంలో చాహల్ వాపింగ్ చేస్తూ కనిపించాడనే వార్త ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. పంజాబ్ టీమ్ సభ్యులు అహ్మదాబాద్ నుండి హైదరాబాద్ వస్తున్న సమయంలో ఈ ఇన్సిడెంట్ జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలు, ఫోటోలు చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. నిజానికి ఈ విషయం బయటకు రావడానికి టీమ్ మేట్ అర్ష్‌దీప్ సింగ్ కారణమయ్యాడు. అతను షూట్ చేసిన ఒక వ్లాగ్‌లో చాహల్ ఇ-సిగరెట్ వాడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పక్కనే శశాంక్ సింగ్ వంటి ఇతర ప్లేయర్లు కూడా ఉన్నారు. అయితే ఈ వీడియో వైరల్ అవ్వగానే, పంజాబ్ కింగ్స్ యాజమాన్యం లేదా అర్ష్‌దీప్ సింగ్ ఆ వీడియోను ఎడిట్ చేసి, చాహల్ ఉన్న సీన్లను కట్ చేసి మళ్ళీ అప్లోడ్ చేశారని నెటిజన్లు స్క్రీన్ షాట్లతో సహా నిరూపిస్తున్నారు. విమానంలో ఇలాంటి పనులు చేయడం తోటి ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించడమేనని సోషల్ మీడియా యూజర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్ 2026లో వాపింగ్ వివాదం రావడం ఇది రెండోసారి. కొన్ని రోజుల క్రితమే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్, పంజాబ్ కింగ్స్ తో మ్యాచ్ జరుగుతున్న సమయంలో డ్రెస్సింగ్ రూమ్ లో వాపింగ్ చేస్తూ కెమెరాకు చిక్కాడు. ఆ విషయంలో బీసీసీఐ సీరియస్ అయ్యి, పరాగ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. ఇప్పుడు చాహల్ కూడా అదే తరహాలో దొరికిపోవడంతో క్రమశిక్షణపై చర్చ మొదలైంది. ఈ వివాదాలపై టీమిండియా సీనియర్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా స్పందించాడు. ముఖ్యంగా రియాన్ పరాగ్ ఇన్సిడెంట్ ను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటివి కెరీర్ కు అస్సలు మంచిది కాదని అన్నాడు. మీ పర్సనల్ లైఫ్ లో ఏం చేసినా ఎవరికీ అభ్యంతరం ఉండదని, కానీ ఒక పబ్లిక్ స్పేస్ లో ఉన్నప్పుడు, ముఖ్యంగా ఒక టీమ్ కు లీడర్ గా, ఎంతో మంది యువతకు ఇన్‌స్పిరేషన్ గా ఉన్నప్పుడు బాధ్యతగా ఉండాలని హితవు పలికాడు. ఇలాంటి చిన్న చిన్న తప్పుల వల్ల మొత్తం ఇమేజ్ డ్యామేజ్ అయ్యే ఛాన్స్ ఉందని అశ్విన్ హెచ్చరించాడు. ప్రస్తుతానికి ఈ వీడియోపై పంజాబ్ కింగ్స్ టీమ్ గానీ, చాహల్ గానీ ఎటువంటి స్టేట్మెంట్ ఇవ్వలేదు. విమానాల్లో స్మోకింగ్ లేదా వాపింగ్ చేయడం చట్టరీత్యా నేరం. మరి దీనిపై విమానయాన సంస్థ లేదా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందో వేచి చూడాలి. ప్లేయర్లు మైదానంలోనే కాకుండా బయట కూడా స్పోర్ట్స్ మన్ స్పిరిట్ తో మెలగాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.




# భువనేశ్వర్ కుమార్ అరుదైన రికార్డ్

ఐపీఎల్ అంటేనే రికార్డుల అడ్డా. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్‌లో ఒక మెమరబుల్ మైలురాయిని చేరుకున్నాడు. గురువారం లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ బరిలోకి దిగడమే ఒక రికార్డుగా మారింది. ఐపీఎల్ హిస్టరీలో ఇప్పటివరకు ఏ ఫాస్ట్ బౌలర్ కూడా 200 మ్యాచ్‌లు ఆడలేదు. ఆ ఘనత సాధించిన ఫస్ట్ ఇండియన్ పేసర్‌గా భువనేశ్వర్ నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్ లో 200 పైగా వికెట్లు తీసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ కూడా అతనే కావడం విశేషం. ఈ అరుదైన రికార్డుపై భువనేశ్వర్ కుమార్ స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు. ఏ మైలురాయి అయినా స్పెషలే అని, కానీ 200 మ్యాచ్‌లు ఆడటం అనేది నిజంగా ఒక బిగ్ అచీవ్‌మెంట్ అని ఆనందం వ్యక్తం చేశాడు. అందుకే చాలా గర్వంగా, హ్యాపీగా ఉందని, ముఖ్యంగా గతేడాది కప్పు గెలిచిన జట్టులో ఉంటూ, ఈ సీజన్ లో కూడా అద్భుతంగా రాణిస్తున్న సమయంలో ఈ రికార్డ్ రావడం ఇంకాస్త స్పెషల్ ఫీలింగ్ ఇస్తోందని పేర్కొన్నాడు. తన కెరీర్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వాటన్నిటిలో ఒకదాన్ని ఎంచుకోవడం కష్టమే కానీ, ఇన్నేళ్ల ప్రయాణంలో తన తొలి వికెట్ మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపాడు. అక్కడి నుండే ఈ జర్నీ మొదలైందని భువీ తన మనసులోని మాటను చెప్పాడు. ప్రస్తుత కాలంలో టీ20 ఫార్మాట్ చాలా వేగంగా మారిపోతోంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో బ్యాటర్లు విరుచుకుపడుతున్నారు. దీనిపై భువనేశ్వర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాటర్ల అప్రోచ్ పూర్తిగా మారిపోయిందని, పవర్‌ప్లేలో వాళ్ళు చాలా అగ్రెసివ్‌గా ఆడుతున్నారని విశ్లేషించాడు. ఇలాంటి కండిషన్స్‌లో బౌలర్లు నిరంతరం తమ గేమ్ ను ఇంప్రూవ్ చేసుకోవడం ఒక పెద్ద ఛాలెంజ్ అని, కానీ తాను మాత్రం ఎప్పుడూ తన బేసిక్స్‌ను బలంగా ఉంచుకోవడానికే ట్రై చేస్తానని, అదే తనను ఇన్ని ఏళ్లుగా సక్సెస్‌ఫుల్‌గా ముందుకు నడిపిస్తోందని వివరించాడు. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే భువనేశ్వర్ ఈ మ్యాచ్‌లో వికెట్ తీయలేక పోయాడు. నాలుగు ఓవర్లలో 34 పరుగులు ఇచ్చాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ ఇంజూరీ సమస్యలతో సతమతమవుతోంది. జోష్ ఇంగ్లిస్, మొహ్సిన్ ఖాన్, ఆవేష్ ఖాన్ వంటి కీలక ప్లేయర్లు ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అర్షిన్ కులకర్ణి, మయాంక్ యాదవ్, షాబాజ్ అహ్మద్ టీమ్ లోకి వచ్చారు.

భారత క్రికెట్ లో భువనేశ్వర్ కుమార్ ఒక సైలెంట్ వారియర్ లాంటివాడని, ఎన్ని కొత్త టెక్నాలజీలు వచ్చినా, ఎంతమంది కొత్త బౌలర్లు వచ్చినా భువీ తన స్వింగ్ తో బ్యాటర్లను వణికించగలడని విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. 200 మ్యాచ్‌ల ఈ మైలురాయి అతని హార్డ్ వర్క్ కు నిదర్శనమని గుర్తు చేస్తున్నారు.

## టీమిండియాలోకి వైభవ్ ఎంట్రీ ఖాయం..

భారత క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ పరుగుల వరద పారిస్తున్న ఈ టీనేజ్ సెన్సేషన్ గురించి టీమిండియా వెటరన్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ కేవలం టీ20లకే పరిమితం కాకుండా టెస్టు క్రికెట్ కూడా ఆడాలని, అప్పుడే ఒక ఆటగాడిగా పరిపూర్ణత వస్తుందని పుజారా అభిప్రాయపడ్డారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వంటి అతిపెద్ద లీగ్‌లో వైభవ్ సూర్యవంశీ అదరగొడుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. ప్రస్తుత సీజన్‌లో ఆ జట్టు తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 404 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో భవిష్యత్తు టీమ్ ఇండియా స్టార్‌గా అవతరించాడు. వైభవ్ పెర్ఫార్మెన్స్ చూసి అతడిని వెంటనే టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అయితే పుజారా మాత్రం వైభవ్ టెస్టు క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారు. “వైభవ్ టీ20ల్లో అద్భుతంగా ఆడుతున్నాడు, అతడికి త్వరలోనే టీమిండియా పిలుపు వస్తుంది. కానీ టెస్టు క్రికెట్ అనేది ప్రతి యువ ఆటగాడి మనసులో ఉండాలి. ఒక ఆటగాడికి గౌరవం, పట్టుదల, టెక్నిక్ అనేవి టెస్టుల నుంచే వస్తాయి. సామర్థ్యం ఉంటే వైభవ్ కచ్చితంగా టెస్టుల్లో కూడా రాణించాలి” అని పుజారా పేర్కొన్నారు. టెస్టు క్రికెట్ గొప్పదే అయినప్పటికీ.. వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) నిపుణులకు కూడా తమదైన ప్రాముఖ్యత ఉంటుందని పుజారా చెప్పారు. శ్రేయస్ అయ్యర్, వైభవ్ వంటి ఆటగాళ్లను వారి బలాబలాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు ఆటగాళ్లను ఎంపిక చేసే విధానాన్ని ఆయన సమర్థించారు. దీనివల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, ఆయా ఫార్మాట్లలో జట్టు మరింత బలంగా తయారవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జియోస్టార్ సిటివి హిందీ ఫీడ్ నిపుణుడిగా తన కొత్త పాత్ర గురించి కూడా పుజారా ముచ్చటించారు.



# భారత క్రికెట్ జట్టులోకి సపోర్టింగ్ స్టాఫ్

భారత క్రికెట్ జట్టు సపోర్టింగ్ స్టాఫ్ లో కీలక మార్పులు చోటు చేసుకోన్నాయి. స్పిన్ బౌలింగ్ కోసం ప్రత్యేకంగా ఓ కోచ్‌ను



నియమించాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పట్టుబట్టాడు. ఈ మేరకు బీసీసీఐకి సిఫార్సు సైతం చేశారు. ఈ పదవికి టీమిండియా మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే పేరును ప్రతిపాదించారు కూడా. బీసీసీఐ ఆమోదం లభిస్తే టీమిండియాలో ప్రత్యేక స్పిన్ కోచ్‌ను నియమించడం ఇదే మొదటిసారి అవుతుంది. ప్రస్తుతం జట్టు సపోర్టింగ్ స్టాఫ్ లో మోర్నే మోర్కెల్ బౌలింగ్ కోచ్‌గా, సితాంశు కోటక్ బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. స్పిన్ బౌలింగ్‌కు ప్రత్యేకంగా కోచ్ అంటూ ఎవరూ లేరు. ఈ లోటును పూరించాలని గౌతమ్ గంభీర్ కోరుకుంటున్నారు. గత కొంతకాలంగా భారత స్పిన్నర్ల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఇదే గంభీర్ ప్రధాన ఆందోళన. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన స్పిన్ దళమైన భారత్.. ఇటీవల సొంతగడ్డపైనే ఇబ్బందులు పడుతోంది. 2024లో న్యూజిలాండ్ భారత్‌ను స్వదేశీ టెస్ట్ సిరీస్‌లో ఓడించి చరిత్ర సృష్టించడమే దీనికి నిదర్శనం. గత ఏడాది భారత్‌లో టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. సైమన్ హార్మర్, కేశవ్ మహారాజ్ వంటి విదేశీ స్పిన్నర్లు మన పిచ్‌లపై మెరుగైన ప్రభావం చూపారు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిల ఫామ్ ప్రశ్నార్థకమైంది. ఈ అంశాలన్నీ జట్టు యాజమాన్యాన్ని పునరాలోచింపజేశాయి. సాయిరాజ్ బహుతులే టీమిండియా మాజీ లెగ్ స్పిన్నర్. ఆయన రెండు టెస్టులు, ఎనిమిది వన్డే ఇంటర్నేషనల్ ఆడారు. టెస్టుల్లో 39 పరుగులు చేసి 3 వికెట్లు, వన్డేల్లో 23 పరుగులుచేసి 2 వికెట్లు సాధించారు. అంతర్జాతీయ కెరీర్ స్వల్పకాలమే అయినా, దేశవాళీ క్రికెట్‌లో ఆయన రికార్డు అద్భుతం. కోచింగ్ పైనా మంచి పట్టు ఉంది. బీసీసీఐ నేషనల్ క్రికెట్ అకాడమీలో కొనసాగుతున్నారు కూడా. ఆయన పలు రంజీ జట్లకు, ఎన్సీఏలో యువ ఆటగాళ్లకు శిక్షణ ఇచ్చారు. ఐపీఎల్ ఫ్రాంచైజీలతోనూ పనిచేశారు. ప్రస్తుతం ఆయన పంజాబ్ కింగ్స్ కు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్నారు. మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సైతం బహుతులే కోచింగ్ పట్ల ప్రభావితులయ్యారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమయంలో ద్రవిడ్ బహుతులేను భారత జట్టులో చేర్చుకోవాలని సిఫార్సు చేశారు. శ్రీలంక పర్యటనలోనూ ఆయన టీమిండియా సహాయక సిబ్బందిలో భాగం. ఇప్పుడాయన సేవలను పూర్తిస్థఆయిలో వినియోగించుకోవాలని గంభీర్ ప్రయత్నిస్తోన్నారు.

# ఫిన్ అలెన్ ఊచకోత..

ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) తమ జోరును కొనసాగిస్తోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ చేరాలంటే ప్రతీ మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉండటంతో కేకేఆర్ అసాధారణ ప్రదర్శనతో జైత్రయాత్రను కొనసాగిస్తోంది.

ఢిల్లీ వేదికగా శుక్రవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఫిన్ అలెన్ విధ్వంసకర శతకంతో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. ముందుగా బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఢిల్లీని కట్టడి చేయగా.. అనంతరం ఫిన్ అలెన్ అజేయ శతకంతో విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ గెలుపుతో కేకేఆర్ తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపు తప్పుకుంది. అద్భుతం జరిగితే తప్పా ఆ జట్టు టోర్నీలో ముందడుగు వేయలేని పరిస్థితిని తెచ్చుకుంది.

## ఢిల్లీకి ప్లేఆఫ్స్ ఛాన్స్ కష్టమే..?

ఐపీఎల్ 2026 సీజన్లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. శుక్రవారం తమ సొంత మైదానమైన అరుణ్ జైట్లీ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘోర పరాజయం పాలవ్వడం ఢిల్లీ ప్లేఆఫ్స్ అవకాశాలను తీవ్రంగా దెబ్బతీసింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానే నిర్ణయాన్ని బౌలర్లు సమర్థవంతంగా అమలు చేయడంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి కేవలం 142 పరుగులు మాత్రమే చేయగలిగింది. 143 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఢిల్లీ బౌలర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. రహానే (13), అంగ్‌క్రిష్ రఘువంశీ (1)లను త్వరగానే పెవిలియన్‌కు పంపినప్పటిక.., ఆ తర్వాత ఢిల్లీ బౌలర్లు పట్టు బిగించలేకపోయారు. మిగిలిన బ్యాటర్లు ఎంతో సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించడంతో ఢిల్లీకి ఈ సీజన్‌లో 7వ ఓటమి ఎదురైంది. కేకేఆర్ స్టార్ బ్యాటర్ ఫిన్ అలెన్ సెంచరీ(47 బంతుల్లో 100)తో చెలరేగడంతో సునాయాసంగా విజయం సాధించారు. ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు ఈ ఓటమి పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికను గమనిస్తే.. ఢిల్లీ క్యాపిటల్స్ 11 మ్యాచ్‌లు ఆడి కేవలం 8 పాయింట్లతో ఉంది. లీగ్ దశలో ఆ జట్టుకు ఇంకా మూడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఒకవేళ ఢిల్లీ తన తదుపరి మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించినా.. ఆ జట్టు గరిష్ఠంగా 14 పాయింట్లకు మాత్రమే చేరుకోగలదు. సాధారణంగా ఐపీఎల్ చరిత్రలో 14 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు చేరుకోవడం అనేది ఇతర జట్ల గెలుపోటములపై, నెట్ రన్ రేట్‌పై పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ఢిల్లీకి ఇప్పుడు ప్రతి మ్యాచ్ ‘డూ ఆర్ డై’ వంటిదే. ఒక్క మ్యాచ్‌లో ఓడినా టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమిస్తుంది. ఢిల్లీ తన తదుపరి పోరాటాన్ని మే 11న ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో సాగించనుంది. ఆ తర్వాత మే 17న రాజస్థాన్ రాయల్స్‌తో, మే 24న తిరిగి కోల్‌కతాతో తలపడాల్సి ఉంది. తమ విజయాలతో పాటు పాయింట్ల పట్టికలో ఎగువన ఉన్న జట్లు ఓడిపోవాలని కూడా ఢిల్లీ ప్రార్థించాల్సి ఉంటుంది. అక్షర్ సేన ఏదైనా అద్భుతం చేస్తే తప్ప ప్లేఆఫ్స్ చేరడం అసాధ్యంగా కనిపిస్తోంది.






## "రణబాలి" మూవీ నుంచి హీరో విజయ్ దేవరకొండ బర్త్ డే స్పెషల్ మేకింగ్ గ్లింప్స్ రిలీజ్

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ రోజు హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు విశెస్ చెబుతూ "రణబాలి" మూవీ నుంచి స్పెషల్ మేకింగ్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. రణబాలి పాత్రలో విజయ్ దేవరకొండ హార్స్ రైడింగ్ కోసం ఎంతగా హార్డ్ వర్క్ చేశారు. ఎలాంటి కఠినమైన ట్రైనింగ్ తీసుకున్నారు అనేది ఈ బర్త్ డే గ్లింప్స్ లో చూపించారు. స్టాలియన్ అనే బ్రీడ్ కు చెందిన గుర్రాలను స్వారీ చేయడం చాలా కష్టం. అయితే సినిమా కోసం ఎంతైనా కష్టపడే విజయ్...చాలా ప్రయత్నాలు చేసి, గాయాలకు తట్టుకుని సక్సెస్ ఫుల్ గా హార్స్ రైడింగ్ చేయడం ఈ గ్లింప్స్ లో ఆకట్టుకుంటోంది. 'ఈ సన్నివేశాలు స్క్రీన్ మీద చూసేందుకు చాలా బాగుంటాయి, అందుకే ఇలాంటి కష్టతరమైన సీన్స్ చేస్తున్నాను..' అని విజయ్ చెప్పడం ఆయనకు సినిమా మీద ఉన్న ప్యాషన్ ను తెలియజేస్తోంది. రణబాలి పాత్రలో విజయ్ చేసే హార్స్ రైడింగ్ సీన్స్, హార్స్ తో పాటు చేసే భారీ యాక్షన్ సీక్వెన్సులు ఈ మూవీలో హైలైట్ కానున్నాయి. "రణబాలి" సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది.

## శరణ్యా ప్రదీప్.. నేను

బాధలోనైనా నవ్వుతుంది. గాయపడినా మౌనంగా ఉంటుంది. కానీ ఆమె మౌనానికీ ఓ కథ ఉందంటూ రాబోతుంది 'నేను' చిత్రం. 'కథాసుధ' పేరిట వైవిధ్యమైన కథలతో ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ అలరిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రూపొందిందే 'నేను'. సీనియర్ నటి జయసుధ కుమారుడు, నటుడు నిహార్ కపూర్ దర్శకత్వం వహించారు. శరణ్యా ప్రదీప్ ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రం మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాబోతుంది. ఈ సందర్భంగా జయసుధ 'స్త్రీ అంటే ఓర్పు.. ప్రతి క్షణం బాధ్యతల గురించి ఆలోచిస్తుంటుంది' అంటూ ఓ వీడియోను విడుదల చేశారు. జేఎస్‌కే ప్రొడక్షన్స్ హౌస్ సంస్థ నిర్మించింది.





## "రౌడీ జనార్ధన" మూవీ నుంచి హీరో విజయ్ దేవరకొండ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నటిస్తున్న క్రేజీ మూవీ "రౌడీ జనార్ధన". స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "రౌడీ జనార్ధన" సినిమా రూపొందుతోంది.

హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విశెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు "రౌడీ జనార్ధన" మూవీ మేకర్స్. ఈ బర్త్ డే పోస్టర్ లో వర్షంలో తడుస్తూ చేతిలో పిస్టల్ తో ఉన్న విజయ్ స్టిల్ ఆకట్టుకుంటోంది. ఆయన ఛాతీపై హీరోయిన్ కీర్తి సురేష్ కాలు పెట్టినట్లు చూపించడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ పోస్టర్ యాక్షన్ తో పాటు రొమాంటిక్ యాంగిల్ ను ఎస్టాబ్లిష్ చేస్తోంది. "రౌడీ జనార్ధన" సినిమాను సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ డిసెంబర్ లో ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## రావు బహద్దూర్ మూవీ విడుదల వాయిదా

వెర్సటైల్ నటుడు సత్యదేవ్, విలక్షణ దర్శకుడు వెంకటేష్ మహా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్' విడుదల తేదీ మరోసారి మారింది. ఈ చిత్రాన్ని తొలుత జూన్ 5న విడుదల చేయాలని చిత్ర బృందం భావించినప్పటికీ, జూన్ 4న రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల కానున్న నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద క్లాష్‌ను తప్పించడానికి మేకర్స్ వెనక్కి తగ్గారు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు తన సొంత బ్యానర్ 'జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్' ద్వారా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే మరియు ఎడిటింగ్ బాధ్యతలను కూడా స్వయంగా నిర్వహిస్తున్నారు. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాల పరాశర్, ఆనంద్ భారతి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఒక పురాతన రాజవంశం, వారసత్వం మరియు రహస్యాల చుట్టూ తిరిగే గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సత్యదేవ్ పవర్ ఫుల్ ఎల్డర్లీ లుక్‌లో కనిపించబోతున్నారు. 'అనుమానం పెనుభూతం' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే విడుదలైన పోస్టర్లు మరియు 'ఓ సుందరి' సాంగ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచాయి.




## ముఖం మీదే చెప్పేస్తుంది

టాలీవుడ్ లో మహేష్ బాబు ,పవన్ కళ్యాణ్ వంటి స్టార్ హీరోలతో జతకట్టి భారీ పాపులారిటీ సంపాదించుకొని బాలీవుడ్లో హీరోయిన్గా మంచి పాపులారిటీ సంపాదించుకుంది నటి అమీషా పటేల్. ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్ లో కూడా దూసుకుపోతున్న అమీషా పటేల్ చివరిగా గదర్ 2 సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నది. ప్రస్తుతం అక్షయ్ ఖన్నా, బాబి డియోల్ కాంబినేషన్లో హమ్ రాజ్ (2002) లో వచ్చే సీక్వెల్లో నటించే అవకాశం ఎక్కువగా ఉన్నది. అయితే ఎలాంటి విషయాలనైనా సరే మొహమాటం లేకుండా ముఖం మీదే చెప్పేస్తుంది అమీషా పటేల్. ఇందులో భాగంగానే తాజాగా నేటి తరం హీరోయిన్లు పరిశ్రమలో పెరుగుతున్న ఫేక్ పిఆర్ సంస్కృతి పైన సోషల్ మీడియా వేదికగా ఫైర్ అయ్యింది. బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టిన వారు కూడా తమను తాము సూపర్ స్టార్లమంటూ ప్రచారం చేసుకుంటున్నారు. పిఆర్ టీమ్స్ కు డబ్బులు ఇచ్చి మరి మళ్ళీ నెంబర్1, నెంబర్ 2 అని పిలిపించుకుంటున్నారు అంతమాత్రాన ఎవరు కూడా స్టార్స్ అయిపోరు. 2026 నాటి పరిస్థితుల ప్రకారం రూ .100 కోట్లు అనేది ప్రస్తుతం పెద్ద లెక్క కాదని కనీసం రూ .200 కోట్ల రూపాయలు అయినా సాధించిన ఒక్క సినిమా కూడా తమ కెరియర్ లో లేని నటీమణులు కూడా తమని తాము స్టార్లు అంటూ చెప్పుకుంటున్నారు. నా కెరియర్ లో కహో నా ప్యార్ హై, గదర్, గదర్2 వంటి బ్లాక్ బస్టర్ విజయాలు అందుకున్న సినిమాలు చాలానే ఉన్నాయి. అవి నాతో నటించిన హీరోల కెరియర్లలో అతిపెద్ద విజయాలుగా నిలిచాయని చెప్పుకొచ్చింది. అటువంటి సందర్భంలోనే గదర్ 3 సినిమా గురించి ఒక కీలకమైన అప్డేట్ ఇవ్వడం జరిగింది ఈ చిత్రం కచ్చితంగా రూ .500 కోట్ల రూపాయల కలెక్షన్స్ రాబడుతుందని ధీమా తెలియజేసింది. తమని విమర్శించడం వల్లే కొంతమంది యూట్యూబర్స్ కి మూడు పూటల కడుపు నిండుతొండి అటువంటి వారిని చూసి జాలి పడడం తప్ప బాధపడకూడదు అంటూ తెలియజేసింది.



## శరవేగంగా ఇరుముడి చిత్ర నిర్మాణం

మాస్ మహారాజ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఇరుముడి ప్రస్తుతం టాలీవుడ్‌లో మంచి హైప్‌ను క్రియేట్ చేస్తోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా మొదటి అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా




డివోషనల్ టచ్‌తో పాటు ఎమోషనల్ డ్రామాను కలగలిపిన కథాంశంతో ఈ సినిమా రాబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ గత చిత్రాలకు భిన్నంగా ఓ పవర్‌ఫుల్ మరియు భావోద్వేగభరిత పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు బలమైన భావోద్వేగాలు కూడా సినిమాలో ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, తాజాగా లభించిన సమాచారం ప్రకారం చిత్రీకరణ దాదాపు చివరి దశకు చేరుకుందని తెలుస్తోంది. ఇంకా సుమారు నెల రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో మేకర్స్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో పనులు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని జీవి ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు. ఇప్పటికే పలువురు భిన్నమైన ప్రాజెక్టులతో తన మార్క్ చూపించిన జీవి ప్రకాష్.. 'ఇరుముడి' కోసం కూడా ప్రత్యేకమైన మ్యూజిక్ వర్క్ చేస్తున్నారని సమాచారం. ముఖ్యంగా ఈ సినిమా కాన్సెప్ట్ పట్ల ఆయనే ఎంతో ఎ÷–జగ్జైటెడ్‌గా ఉన్నారని టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది.

భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇటీవల వరుస విజయాలతో టాప్ ప్రొడక్షన్ హౌస్‌గా నిలిచిన మైత్రి సంస్థ.. 'ఇరుముడి'ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. యాక్షన్, భక్తి, ఎమోషన్‌ల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సంపాదించుకోవడం విశేషం. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాత ఈ సినిమాను అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## 112వ చిత్రంపై భారీ ఆసక్తి

నటసింహం నందమూరి బాలకృష్ణ తన కెరీర్‌లో ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన దశలో ఉన్నారు. వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్న ఆయన, తన 111వ చిత్రాన్ని దర్శకుడు గోపీచంద్ మలినేనితో తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమా పూర్తయ్యాక వెంటనే ఆయన చేయబోయే 112వ చిత్రం కూడా ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాను ప్రముఖ దర్శకుడు కొరటాల శివ డైరెక్ట్ చేయనున్నారు.ఈ కాంబినేషన్ మొదటిసారి కుదరడం వల్లే కాకుండా, ఇద్దరూ తమ తమ స్టైల్స్‌లో భారీ హిట్స్ ఇచ్చినవారే కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లోనే కాకుండా అభిమానుల్లో కూడా పెద్ద చర్చ జరుగుతోంది. అయితే సినిమా అధికారికంగా ప్రకటించినప్పటి నుంచి కొన్ని ఆసక్తికరమైన రూమర్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎవరన్నది పెద్ద ప్రశ్నగా మారింది. తొలుత ఈ సినిమాకు అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తారని బలమైన ప్రచారం జరిగింది.



## తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు రూ.4 లక్షల చెక్కును అందించిన హీరో కృష్ణసాయి

టాలీవుడ్ హీరో కృష్ణసాయి తన సేవా కార్యక్రమాలతో మరోసారి ప్రశంసలు అందుకున్నారు. తన ఆధ్వర్యంలో నడుస్తున్న 'కృష్ణసాయి ఇంటర్నేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా సమాజ సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలకు మద్దతుగా తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు రూ.4 లక్షల చెక్కును విరాళంగా అందించారు.

హైదరాబాద్‌లోని లోక్ భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో యువతకు ఆదర్శంగా నిలుస్తూ సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణసాయిని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై వీరిద్దరు చర్చించుకున్నారు. కృష్ణసాయి తన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, వైద్య సహాయం, అవసరార్థులకు నిత్యావసరాల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తూ యువతలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని గవర్నర్ ప్రశంసించారు. ఇక సినిమాల విషయానికి వస్తే, కృష్ణసాయి ప్రస్తుతం పలు అప్‌కమింగ్ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. కృష్ణసాయి ముఖ్య పాత్రలో నటించిన 'పోలీస్ కంప్లైంట్' త్వరలో విడుదల కానుంది. ఒకవైపు సినీ రంగంలో తన ప్రతిభను చాటుకుంటూనే, మరోవైపు సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలుస్తుండటం విశేషం. సినీ నటుడిగా మాత్రమే కాకుండా సేవామూర్తిగా కూడా కృష్ణసాయి మంచి గుర్తింపు సంపాదించుకుంటున్నారు

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380